హైదరాబాద్ వార్త

కల్తీపై నిఘా ఏదీ?

-హోటల్ వంటకాల్లో కల్తీనూనె వాడకం
-పట్టించుకోని ఆహార కల్తీ నిరోధక శాఖ
-ఫిర్యాదులొస్తే మొక్కుబడిగా తనిఖీలు
-రోగాల బారిన పడుతున్న ప్రజలు

హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త

జీహెచ్ఎంసీ, ఎంఎంసి, సిఎంసి పరిధిలోని ప్రధాన రెస్టారెంట్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు, మాంసం దుకాణాలు, ఆహార కల్తీ నిరోధక శాఖ అధికారులు ప్రతినెలా విధిగా తనిఖీలు చేయాలి. కానీ ఏదైనా ఘటనలు జరిగిన సమయంలోనే హడావిడి చేసి, తర్వాత పట్టించుకోకపోవడంతో ప్రజల ఆహార భద్రత ప్రశ్నార్థకంగా మారుతోంది.- ప్రధాన హోటళ్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో వినియోగించే నూనెల్లో ఎక్కువగా కల్తీవి వాడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. దీనికితోడు హోటళ్లు, రెస్టారెంట్లలో వంటగదుల్లో పూర్తిస్థాయిలో పరిశుభ్రత లేకపోవడంపై పరిశీలించే వారు కరువైన పరిస్థితి నెలకొందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయాల విషయంలో కూడా తక్కువ గ్రేడ్ ఉన్నవాటిని కొనుగోలు చేసి వినియోగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. వీటిన్నింటిపై తనిఖీలు లేకపోవడంతో పట్టణ, నగర ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. శివారుల్లో వందల సంఖ్యలో హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, మాంసాహార దుకాణాలు, బేకరీలు, మిఠాయి దుకాణాలున్నాయి. వీటి నిర్వాహణపై ఆహార కల్తీ నిరోధకశాఖ నుంచి తప్పకుండా అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ చేసుకుని అనుమతి తీసుకున్న వారి సంఖ్య తక్కువగా ఉంది. కొత్తగా ఏర్పాటు చేస్తున్న వారు అసలు తీసుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ వసతి గృహాల్లో ఆహార నమూనాలు సేకరించి ప్రయోగశాలకు పంపి నివేదికలు సమర్పించాల్సి ఉన్నప్పటికీ పట్టించు కోవడం లేదు.

నిబంధనలు గాలికి..

ఆహార వ్యాపారాలు ఊపందుకున్నాయి. ఇబ్బడి ముబ్బడిగా హోటళ్లు, బిర్యానీ పాయింట్లు, రెస్టారెంట్లు, టిఫిన్ సెంటర్లు, బేకరీలు, తినుబండారాల తయారీ కేంద్రాలు వెలిశాయి. ఆహార పదార్థాల తయారీదారులు, విక్రేతలు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఎఐ) ప్రమాణాలను పాటిస్తూ.. శుభ్రతతో పాటు తాజా సరుకులతో పదార్థాలను తయారు చేయాలి. చాలా కేంద్రాలు ఈ నిబంధనలను గాలికి వదిలేస్తున్నారనే విమర్శలున్నాయి. పర్యవేక్షణ లోపం ప్రజలకు శాపం..ఆహార భద్రతాధికారి పోస్టులు ఖాళీగా ఉండటంతో పాటు హెల్త్ ఆఫీసర్లు లేకపోవడంతో హోటళ్లు, తినుబండారాల కేంద్రాలు, మాంసం క్రయవిక్రయ కేంద్రాలలోని పదార్థాలపై పర్యవేక్షణ కరవవుతోంది. దీంతో తినుబండారాల తయారీతో పాటు హోటళ్లు, మాంసం క్రయవిక్రయ కేంద్రాలను నడిపేవారు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా బోడుప్పల్ పరిధిలో ఎంఎంసి అధికారులు తనిఖీలు పేరుకు మాత్రమేననివినియోగదారులు పేర్కొంటున్నారు.

వినియోగదారుల చట్టం ప్రకారం..

వినియోగదారుల హక్కుల చట్టం ప్రకారం తినుబండారాల తయారీలో శుభ్రత, నాణ్యత విధిగా పాటించాల్సి ఉండగా.. జీహెచ్ఎంసీ, ఎంఎంసి, సిఎంసి పరిధిలోని మున్సిపల్ సర్కిళ్లలో అమలుకు నోచుకోవడం లేదు. చౌరస్తాలు, పార్కులు, రద్దీ ప్రదేశాలు, బస్ స్టేషన్లు, రైల్వేస్టేషన్ల సమీప ప్రాంతాలతో పాటు హైదరాబాద్ - వరంగల్ జాతీయ రహదారి, రాజీవ్ రహదారితో పాటు హైదరాబాద్ - నిజామాబాద్ రహదారి ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపుల ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, టీ స్టాళ్లలో పరిశుభ్రత చర్యలు కనిపించడం లేదు. రహదారులపై ఉండే హోటళ్లు నిత్యం రద్దీగా ఉంటున్నాయి. వాహనాల రాకపోకలతో దుమ్ము, ధూళి ఆహార పదార్థాలపై పడుతోంది. అయినప్పటికీ నిర్వాహకులు వాటిని విక్రయిస్తున్నారు. ముఖానికి మాస్కులు లేకుండా చేతులకు రక్షణ కవచాలు (తొడుగులు) వేసుకోకుండానే ఆహారపదార్థాలు, తినుబండారాలు తయారుచేస్తున్నారు. ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో నూడుల్స్, ఫ్రైడ్‌రైస్ తయారీ తర్వాత ప్లాస్టిక్ పాత్రలు, కవర్లలో వడ్డిస్తున్నారు. ఆహార పదార్థాలపై ఎలాంటి రక్షణ చర్యలు లేక ఈగలు, దోమలు వాలుతున్నాయి.

సిండికేట్లు, బినామీల చేతుల్లోనే..!

-వైన్స్‌ల లైసెన్స్ ఒకరిది..నిర్వాహణ మరొకరిది
-రిజర్వ్‌డ్ దుకాణాల సైతం గుడ్‌విల్ కింద కొనుగోలు
-ఐటీశాఖ దాడుల్లో గుట్టురట్టైన దందా
-లైసెన్స్ దారులదే బాధ్యత అంటున్న ఎక్సైజ్‌శాఖ

హైదరాబాద్, మే 13,ప్రభాతవార్త:

నూతన మద్యంపాలసీలో అధికారులు ఎన్ని మార్పులు చేర్పులు చేసినా..ఎన్ని నిబంధనలు పెట్టిన మద్యం దుకాణాలు మాత్రం ఎవరికి దక్కాలో వారికే దక్కుతున్నాయి. ఆరునెలల క్రితం గ్రేటర్‌లో మద్యం దుకాణాలకు డ్రా నిర్వహించి కొత్తదుకాణాలకు ప్రారంభించిన సంగతి తెలిసిందే... ఈనేపథ్యంలో దుకాణాల్లో దక్కిన వారిలో 70శాతానికి పైగా పాతవారేఉన్నారు. అయితే మిగతా 30శాతం వారు కూడా కొత్తవాళ్లు దక్కించుకొని దుకాణాలు కూడా ఓపెన్ చేశారు. అయితే పలు ప్రాంతాల్లో దుకాణాలు దక్కించుకున్న లైసెన్స్‌దారులపై సిండికేట్ మద్యం వ్యాపారులు, నేతల బినామీలు ఒత్తిడి తెచ్చి వారి నుంచి స్వాధీనం చేసుకున్నారు. తాజాగా నగరంలోని చందా నగర్‌లో ఎస్సీలకు కేటాయించిన లిక్కర్ షాపు బినామీ పేరుతో నడుపుతున్నట్లు ఐటీ శాఖ గుర్తించింది. ఎస్సీలకు రిజర్వ్ చేసిన లిక్కర్ షాపులను థర్డ్ పార్టీ ప్రైవేట్ వ్యక్తులు బయటి నుంచి అంతా తామై నడిపుతున్నట్లు ఐటీ శాఖ అధికారుల పరిశీలనలో వెల్లడైంది. లిక్కర్ షాపు కార్యకలాపాలు మొత్తం సిండికేట్ వ్యక్తులే పర్య వేక్షిస్తున్నట్లు గుర్తించింది. అలాగే మల్కాజిగిరిలో 20 రిజర్వ్ లైసెన్స్ షాపుల్లో 10 బినామిలే నడు పుతున్నట్లుగా గుర్తించింది.

మేడ్చల్‌లో 17 రిజర్వ్‌డ్ లైసెన్స్ లిక్కర్ షాపుల్లో 14 షాపు ఓనర్ల ఆదాయం రూ.10 లక్షలు కంటే తక్కువ ఉన్నట్లు ఐటీ శాఖ గుర్తించింది. ఈనేపథ్యంలో చందానగర్‌లో శ్రీ భవానీ వైన్స్‌లో ఐటీ శాఖ అధికారులు సోదాలు చేపట్టారు. ఎస్సీ రిజర్వేషన్ కోటాలో సురేష్ అనే వ్యక్తి ఈ లిక్కర్ షాపు దక్కించుకున్నాడు అతడు.. తన ఆదాయాన్ని రూ.4 నుంచి రూ.5 లక్షలు చూపి.. లిక్కర్ లైసెన్స్ ఫీజు రూ.21 లక్షలు చెల్లించాడు. అయితే ఒక్క నెలలోనే ఈ షాపు రూ. 4.3 కోట్లు ఆదాయాన్ని రాబట్టింది. దీంతో రంగంలోకి దిగిన ఐటీ శాఖ సోదాలు చేపట్టింది. ఈ వ్యవహారంలో ప్రైవేట్ వ్యక్తులకు సురేష్ బినామీగా ఉన్నట్టు గుర్తించింది. కేవలం పేరు మాత్రమే సురేష్‌దిగా ఉన్నా..అతడికి ఎలాంటి సంబంధం లేకుండా లావాదేవీలు జరిగినట్లు ఐగుర్తించింది. దీంతో ఈ వైన్ షాపును బినామీ ప్రొహిబిషన్ యాక్ట్ కింద ఐటీ అధికారులు సీజ్ చేశారు.

లైసెన్స్‌దారులదే బాధ్యత..

ముఖ్యంగా కొత్తగా దుకాణాలు దక్కించుకున్న వారికి ఈవ్యాపారంలో అనుభవం పెద్దగా లేకపోవడం, అద్దె అధికంగా చెల్లించాల్సి వస్తుండటంతో నష్టాలు మూటగట్టుకోవాల్సి వస్తుందేమోనన్న భయం పెడుతున్నారు. ఈనేపథ్యంలో ఇదే అదునుగా భావిస్తున్న పలువురు బడావ్యాపారులు లైసెన్స్‌ఫీజు, దరఖాస్తు ఫీజును చెల్లించడంతో పాటుగా గుడ్‌విల్ కింద 20 నుంచి 40లక్షల వరకు చెల్లిస్తామని ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. అంతేకాకుండా పలుప్రాంతాల్లో దుకాణాల్లో వాటాదారులుగా కూడా చేర్చుకుంటున్నారు. ముఖ్యంగా ఏపీకి చెందిన బడావ్యాపారులు ఇక్కడి దుకాణాలపై దృష్టి సారించారు. తెలంగాణలో ముఖ్యంగా గ్రేటర్‌లో కొత్తగా దుకాణాలు దక్కించుకున్నవారి వివరాలు సేకరించి వారితో మాట్లాడి ఏఇబ్బందికాకుండా తాము చూసుకుంటామని అవసరమైతే వాటాలు ఇస్తున్నారు. అయితే ఈవ్యవహారంపై ఎక్సైజ్‌శాఖ ఉన్నతాధికారులను ప్రశ్నించగా లైసెన్స్‌దారులు గుడ్‌విల్ కింద దుకాణాన్ని ఇతరులకు అప్పజెప్పినప్పటికీ అబ్కారీశాఖ రికార్డుల్లో పేరు మాత్రం మారదన్నారు.

గుడ్‌విల్ కింద తీసుకున్నవారు ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా అక్రమాలకు పాల్పడితే దానికి పూర్తి బాధ్యత లైసెన్స్‌దారుడిదేనని పేర్కొంటున్నారు.

తెలంగాణ జంతు, పార్కుల ప్రాధికార సంస్థ పాలకమండలి సమావేశం

సమావేశంలో పాల్గొన్న రాష్ట్ర అటవీ,పర్యావరణ,దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ,అటవీ శాఖ ఉన్నతాధికారులు

చార్మినార్,మే 13 ప్రభాతవార్త : తెలంగాణ జంతు,పార్కుల ప్రాధికార సంస్థ 15వ పాలకమండలి సమావేశం బుధవారం డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో జరిగింది.తెలంగాణ రాష్ట్ర అటవీ,పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ సమావేశానికి అధ్యక్షత వహించారు.జూపార్కుల అభివృద్ధి,వార్షిక కార్యాచరణ ప్రణాళిక ప్రతిపాదనాలపై సమావేశంలో చర్చించారు.జూ పార్కుల డైరెక్టర్ డాక్టర్.సునీల్ ఎస్.హీరేమత్ కాకతీయ జూపార్కు,కేబీఆర్ పార్కు,మృగవాణి డీర్ పార్కు,మహవీర్ హరిణ వనస్థలి డీర్ పార్కు,పాఖాల వన్యప్రాణుల అభయారణ్యాలతో సహా అన్ని జంతు ప్రదర్శన శాలలు,జింకల పార్కుల యొక్క సమగ్ర ప్రజెంటేషన్‌ను సమర్పించారు.హైదరాబాద్ జూపార్కు క్యూరేటర్ జె.వసంత నెహ్రూ జూలాజికల్ పార్కులో సంవత్సరంలోజరిగిన అభివృద్ధి పనులు,అమలు చేసిన కొత్త కార్యక్రమాలు,కొత్త జంతువుల ఎన్‌క్లోజర్ల నిర్మాణం కోసం ప్రతిపాదనాలు,జంతు మార్పిడి కార్యక్రమం విజయవంతం గురించి వివరించారు.ఈ సందర్భంగా రాష్ట్ర రాష్ట్ర అటవీ,పర్యావరణ,దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ సందర్శకుల సౌకర్యార్థం కొత్త సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేయటం ద్వారా జంతు ప్రదర్శన శాలలు,పార్కులను ఉన్నత ప్రమాణాలతో అభివృద్ధి చేయటానికి తీసుకున్న చర్యలు పట్ల అభినందించారు.నెహ్రూ జూలాజికల్ పార్కుకు ప్రతీ ఏడాది 23 లక్షల మంది సందర్శకులు తిలకించటానికి రావటం ఎంతో గర్వకారణమని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో పర్యావరణ,అటవీ,దేవాదాయ ప్రిన్సిపల్ కార్యదర్శి అహ్మద్ నదీమ్,పిసిసిఎఫ్ ఉన్నతాధికారులు డాక్టర్.సువర్ణ,వినయ్ కుమార్ ఐఎఫ్ఎస్ అధికారులు రత్నాకర్ జోహరి,ప్రియాంక వర్గీస్,జూపార్కుల డైరెక్టర్ డాక్టర్.సునీల్ ఎస్.హీరేమత్,జూపార్కు క్యూరేటర్ జె..వసంతతో పాటు రాష్ట్రంలోని పలువురు అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

లిఫ్టులో ఇరుక్కొని ఐదేళ్ల చిన్నారి మృతి

-ఐటీ కారిడార్ గౌలిదొడ్డిలో ఘటన

తండ్రితో దిగిన బిస్టు ఘోష్ (ఫైల్‌ఫోటో)

గచ్చిబౌలి, మే 13 ప్రభాతవార్త

ఓ ప్రైవేటు హాస్టల్ లిఫ్టులో ఇరుక్కొని ఐదేళ్ల చిన్నారి మృతిచెందింది. ఆడుకుంటూ వెళ్లి లిఫ్టు డోరు తెరిచిన చిన్నారి లిఫ్టుకు ఉన్న రెండు ఇనుప గేట్ల మధ్యలో ఇరుక్కుపోయి ప్రాణాలు విడిచింది. గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరి ధిలో చోటుచేసుకున్న ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం... జార్ఖండ్‌కు చెందిన మోహన్ హోష్ తన కుటుంబంతో కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చాడు. గచ్చిబౌలి ఐటి కారిడార్ పరిధిలోని గౌలిదొడ్డిలో గల మహీ ఉమెన్స్ పీజీ హాస్టల్‌లో గత 7సంవత్సరాలుగా వంట మనిషిగా పనిచేస్తున్న మోహన్ అక్కడే తన భార్య కెంతూ ఘోష్, కుమారుడు బిట్టు ఘోష్, కోడలు, ఐదేళ్ల మనుమరాలు బిస్టు ఘోష్(5)తో కలిసి నివాసం ఉంటునా్నడు. ఇతని కుమారుడు బిట్టు ఘోష్ సైతం అదే హాస్టల్‌లో వంట మనిషిగా తం డ్రితో కలిసి పనిచేస్తున్నాడు. కాగా ఐదేళ్ల చిన్నారి బిస్టు ఘోష్ బుధవారం మధ్యాహ్నం ఆడుకుంటుండగా, కుటుంబ సభ్యులు మొత్తం ఎవ్వరి పనుల్లో వారు ఉన్నారు. ఈ క్రమంలో బిస్టు ఘోష్ ఆడుకుంటూ వెళ్లి భవనంలో ఉన్న లిఫ్టు డోర్ తెరిచింది. లిఫ్టుకు ఉన్న రెండు ఇనుప డోర్ల మధ్య బిస్టు ఘోష్ ఇరుక్కుపోగా, లిఫ్టు కింద నుంచి 5వ ఫ్లోర్‌కు, అక్కడి నుంచి మూడవ ఫ్లోర్‌కు వచ్చి ఆగింది. లిఫ్టు డోర్ల మధ్య ఇరుక్కుపోయిన బిస్టు ఘోష్‌ను ఎవ్వరూ గుర్తించకపోవడంతో తలకు తీవ్ర గా యాలై అక్కడికక్కడే మ ృతిచెందింది. మూడవ ఫ్లోర్‌లో ఆగిపోయిన లిస్టును గమనిం చిన భవనంలో ఉండే నివాసితులు పరిశీలించగా, బిస్టు ఘోష్ శరీరం లిఫ్టు మధ్య ఇరుక్కుపోయి కనిపించింది. దీంతో వెంటనే వారు పోలీసులకు సమాచారం అందిం చగా, సంఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు బిస్టు ఘోష్ మృతదేహాన్ని లిస్టు నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. కాగా ఆడుకుంటూ వెళ్లి లిఫ్టులో ఇరుక్కుపోయి ఐదేళ్ల చిన్నారి మ ృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.

మల్లాపూర్‌లో ఘోర రోడ్డు ప్రమాదం..ఇద్దరు కూలీలు మృతి

నాచారం, మే 13 ప్రభాతవార్త : నాచారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్లాపూర్ స్వాగత్ కన్వెన్షన్ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందారు. వేగంగా వచ్చిన కారు ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.పోలీసుల వివరాల ప్రకారం.. ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న మోలాలికి చెందిన గణేష్ (49), గంగాధర్ (41) లు బొల్లి గూడెం వైపు వెళుతున్నారు. ఈ క్రమంలో మల్లాపూర్ బెల్ కంపెనీ నుంచి స్వాగత్ గ్రాండ్ హోటల్ వైపు మీదుగా వెళుతున్న క్రమంలో వీరి ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్నది. దీనితో వీరిద్దరిని ఆసుపత్రులకు తరలించగా గాంధీ హాస్పిటల్ లో గంగాధర్ మృతి చెందగా, సో ప్రైవేట్ హాస్పిటల్ లో గణేష్ మృతి చెందాడు.. మృతులు దినసరి కూలీలుగా పని చేస్తూ కుటుంబాలను పోషిస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటనతో మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మాకు ఉన్న ఆధారం కోల్పోయాం.. కుటుంబాలను ఆదుకోవాలి.. మాకు న్యాయం చేయాలి" అంటూ వారు నాచారం పోలీస్ స్టేషన్ ఎదురుగా ఆందోళనకు దిగారు. దీనితో నాచారం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. కారు డ్రైవర్ అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదం అనంతరం కారును అక్కడే వదిలేసి పరారైన నిందితుల కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నేపాలి మెయిడ్ సర్వెంట్లపై నేరేడ్‌మెట్ పోలీసుల నిఘా

నేరేడ్ మెట్ , మే 13,ప్రభాతవార్త :

నగరంలో ఇటీవల నేపాలి మెయిడ్ సర్వెంట్లు, వాచ్‌మెన్‌ల పేరుతో జరుగుతున్న దొంగతనాలు, రాబరీ ఘటనల నేపథ్యంలో నేరేడ్మెట్ పోలీసులు ప్రత్యేక నిఘా చేపట్టారు. మల్కాజిగిరి ఏసీపీ యాదగిరి రెడ్డి ఆదేశాల మేరకు సీఐ సందీప్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం వాయుపురి, డిఫెన్స్ కాలనీ, సాయినాథపురం, చంద్రగిరి కాలనీ, ఆఫీసర్స్ కాలనీ, ఆర్కే పురం ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు.ఇళ్లలో పనిచేస్తున్న నేపాలి మేడ్ సర్వెంట్లు, వాచ్‌మెన్‌ల వివరాలను సేకరించి వారి గత చరిత్రను పరిశీలించారు. కాలనీ అధ్యక్షులు, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమై పనిమనుషులను నియమించుకునే ముందు పూర్తి వివరాలు, ఆధార్, ఫోన్ నంబర్లు, స్వగ్రామ సమాచారం తీసుకోవాలని సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో వెరిఫికేషన్ చేయించిన తర్వాతనే పనిలో పెట్టుకోవాలని తెలిపారు.డిఫెన్స్ కాలనీ, సైనిక్‌పురిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఏసీపీ యాదగిరి రెడ్డి మాట్లాడుతూ.. కొందరు నేపాలి మేడ్ సర్వెంట్లు ఒంటరి వృద్ధులను లక్ష్యంగా చేసుకుని ముందుగా నమ్మకం సంపాదించి, అనంతరం దొంగతనాలు, రాబరీలకు పాల్పడుతున్న ఘటనలు వెలుగుచూస్తున్నాయని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సీఐ సందీప్ కుమార్ కోరారు. ప్రజల భద్రత కోసం ప్రత్యేక తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎస్సై సాయి అవినాష్, కాలనీ అధ్యక్షుడు కెప్టెన్ రమేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

సైఫాబాద్, మే 13 ప్రభాతవార్త: గడిచిన అసెంబ్లీ ఎన్నికలు సందర్భంగా కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలకు ఏలాంటి కాలయాపన చేయకుండా తక్షణమే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జెఎసి డిమాండ్ చేసింది. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి ఛైర్మన్ సుల్తాన్ యాదగిరి మాట్లాడుతూ..జూన్ 2వ తేదీ తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం లోగా ప్రభుత్వం ఉద్యమకా రుల డిమాండ్లను అమలు చేయాలని, లేకపోతే మరొక ఉద్యమం తప్పదని జెఎసి నాయకులు హెచ్చరించారు. ఎన్నికల మ్యానిఫెస్టో లో ప్రకటించిన విధంగా తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, నెల, నెలా 25 వేలు పెన్షన్ గుర్తింపు కార్డులు, 25 లక్షలు సామాన్య ప్రమాద బీమా, వంటివి అందజేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో జెఎసి నాయకులు యాదగిరి, మల్లేష్, శోభారాణి, రహిమున్నిసాబేగం, లక్ష్మి, శారద తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

-బిల్డ్ నౌ,ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి
-'నో బిన్ నో ట్రేడ్' నిబంధనలను కఠినంగా అమలు చేయాలి
-అధికారులకు సైబరాబాద్ కార్పొరేషన్ కమిషనర్ సృజన ఆదేశం

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సిఎంసి కమిషనర్ జి.సృజన

హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త:

ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు వేగవం తంగా పూర్తిచేయాని సమస్యల పరిష్కారంలో అధికారులందరూ కలిసికట్టుగా పనిచేయాలని సిఎంసి కమిషనర్ జి.సృజన అధికారులను ఆదే శించారు. ఈమేరకు బుధవారం సిఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో జోనల్ కమిషనర్లు, విభాగాధిపతులు, డిప్యూటీ కమిష నర్లు ,ఇంజనీరింగ్ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా ఇంజ నీరింగ్ పనులు, పారిశుధ్యం, టౌన్ ప్లానింగ్, ప్రత్యేక ప్రాజెక్టులు ,వార్డు స్థాయి అమలుపై కమి షనర్ సుదీర్ఘంగా చర్చించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పనుల నాణ్యత, కొలతలు, బిల్లుల ధృవీకరణపై కఠినమైన పర్యవేక్షణ ఉండాలనాననరు. ఫిర్యాదులను కేవలం మూసివేయడం కాకుండా పౌరులకు స్పష్టమైన సమా ధానాలు ఇవ్వాలన్నారు. ప్రతిరోజు ఒక వార్డు కార్యక్రమంలో భాగంగా గుర్తించిన సమస్యలపై అధికారులకు ప్రత్యేక సూచనలు చేశారు. వార్డు సందర్శనలో వెల్లడైన సమస్యలను ప్రాధాన్యత ప్రాతిపదికన పరిష్కరించాలని అదే సర్కిల్‌లో తదుపరి పర్యటన జరిగే లోపు ఆసమస్య మళ్ళీ కనిపించొద్దన్నారు. ప్రతి సమస్యను పోర్టల్‌లో అప్‌డేట్ చేస్తూ, పూర్తిగా పరిష్కారమయ్యే వరకు పర్యవేక్షించాలని సూచించారు. అలాగే బిల్డ్ నౌ, ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరిం చాలని పోలీ స్ శాఖ సమన్వయంతో ఆక్రమణల తొలగింపు ముమ్మరం చేయాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. జంక్షన్ల అభివృద్ధి, ఫ్లైఓవర్లు, వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో పనులను వేగవంతం చేయాలన్నారు.పారిశుధ్యం, జివిపి పాయింట్ల నిర్మూలన, సాట్ వాహనాల పర్యవేక్షణ మెట్రో స్టేషన్ పరిసరాల్లో ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని దోమల నివారణకు వార్డుల వారీగా ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి ఫాగింగ్, స్ప్రేయింగ్ మరియు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు.పార్కులు, క్రీడా ప్రాంగణాలు, కమ్యూనిటీ హాళ్ల నిర్వహణ లీజుల స్థితి గతులను సమీక్షించి, అవి ప్రజలకు మెరుగ్గా ఉపయోగపడేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

సిఎంసి, జోన్ అధికారుల పేరిట వసూళ్లు..

-అవినీతిమయంగా కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్,ఎసిపిల కార్యాలయాలు
-రెచ్చిపోతున్న ఓ ఇద్దరు ఘనాపాటీలు

కూకట్‌పల్లి జోన్ కార్యాలయం

హైదరాబాద్, మే 13, ప్రభాతవార్త :

కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్ (సీపీ) కార్యాలయంతో పాటు కూకట్‌పల్లి, మూసాపేట సర్కిళ్ల అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఏసీపీ) కార్యాలయాల్లో అవినీతి రాజ్యమేలుతోంది. ఈ కార్యాలయాల్లో కీలక బాధ్యతల్ని నిర్వహిస్తున్న ఓ ఇద్దరూ అధికారుల అవినీతి అక్రమ వసూళ్ల హద్దులు దాటినా సిఎంసి కమిషనర్‌తో పాటు జోనల్ కమిషనర్ పట్టించుకోవడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో తమకు అడ్డే లేదన్న ధీమాతో సదరు ఇద్దరు అధికారులు అమ్యామ్యాల కోసం అడ్డదారులు తొక్కుతున్నారు.

కోట్లు దండుకుంటున్న ఆ ఇద్దరు అక్రమార్కులు ఎవరు?

ఓసీల భవన నిర్మాణ అనుమతులకు ఇష్టారాజ్యంగా వసూళ్లు

ఒక్క మాటలో చెప్పాలంటే కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్ (సీపీ) కార్యాలయంతో పాటు కూకట్‌పల్లి, మూసాపేట ఏసిపి కార్యాలయాలు అవినీతిలో రికార్డు సృష్టిస్తున్నాయి. భవన నిర్మాణ అనుమతులతో పాటు ఓసీలు జారీ కావాలంటే ఆ ఇద్దరు అధికారులు అడిగినన్ని మామూలు ఇవ్వాల్సిందే.. ముడుపులు ఇవ్వకుంటే సిటీ ప్లానర్ (సీపీ) కార్యాలయాల చుట్టూ కాళ్లు అరిగేలా ప్రదక్షిణలు చేయాల్సిన పరిస్థితిని సృష్టిస్తున్నారు. భవన నిర్మాణ అనుమతులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న నిర్ణీత సమయంలో అనుమతులను ఇవ్వాలి. కానీ ఇదంతా కాగితాలు, ప్రకటనలకే పరిమితం. నెలలు దాటిన అనుమతులు రాని పరిస్థితి నెలకొంది. అన్నీ పత్రాలు సక్రమంగా ఉన్నప్పటికీ అనుమతులు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తే ఏదో ఒకటి సాకు చూపెడుతూ దరఖాస్తుదారులను ముప్పతిప్పలు పెడుతున్నారు. కొందరు అధికారులు బ్రోకర్లతో దరఖాస్తుదారుల నుంచి లక్షల్లో అక్రమ వసూళ్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. నిర్మాణ అనుమతులు సకాలంలో రాకపోవడంతో దరఖాస్తుదారులు అనేక అవస్థలు పడుతున్నారు. ఈ కార్యాలయాల్లో ప్రతి పనికి ఓ రేటు కట్టి లంచాలు వసూలు చేస్తున్నారు. బ్రోకర్లను కలిస్తే తప్ప అనుమతులు రావడం లేదు. భవన నిర్మాణ అనుమతుల్లో విపరీతమైన జాప్యం జరుగుతుండడంతో సంబంధిత అధికారులకు తెలపడానికి వెళితే వారు కార్యాలయాల్లో అందుబాటులో ఉండడం లేదు. అందుబాటులో లేని అధికారుల కారణంగా దరఖాస్తుదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

సీఎంసీ, జోన్ అధికారుల పేరిట వసూళ్లు..

కూకట్‌పల్లి జోన్ సిటీ ప్లానర్ (సీపీ) కార్యాలయంతో పాటు కూకట్‌పల్లి మూసాపేట సర్కిళ్లలో కీలక బాధ్యతలు నిర్వహిస్తున్న ఓ ఇద్దరూ అవినీతి ఘనపాటీలు చెట్టు పేరు చెప్పి కాయలు అమ్ముకున్న చందంగా.. ఏకంగా సీఎంసీ కార్యాలయంతో పాటు కూకట్‌పల్లి జోన్ కమిషనర్ కార్యాలయంలో కూడా ముడుపులు ఇవ్వాల్సి ఉందని చెప్పి, బిల్డర్లు, నిర్మాణదారుల నుంచి పెద్ద మొత్తంలో నిర్మాణ అనుమతులకు ముడుపులు దండుకుంటున్నట్లు తెలిసింది. కొందరు అధికారులు భవన నిర్మాణ దరఖాస్తుదారులను దోచుకోవడమే తమ విధి అన్నట్టుగా ఇష్టారాజ్యంగం ముడుపులు దండుకుంటున్నట్లు బాహాటంగా విమర్శలు వినిపిస్తున్నాయి. కూకట్‌పల్లి, మూసాపేట సర్కిల్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు పెద్ద ఎత్తున వెలుస్తున్న అటు సిఎంసి కార్యాలయం అధికారులు ఇటు కూకట్‌పల్లి జోన్ కార్యాలయం అధికారులు అడ్డుకోవడం లేదు. దీంతో అక్రమ నిర్మాణాలకు అడ్డు అదుపు లేకుండా పోతుంది. తీసుకున్న అనుమతుల కంటే అదనంగా అక్రమ నిర్మాణాలు ఐదారు అంతస్తులు నిర్మిస్తున్నారు. అనేక ప్రాంతాల్లో వ్యక్తిగత గృహాలతో పాటు వ్యాపార, వాణిజ్య (కమర్షియల్) భవనాలు నిబంధనలకు విరుద్ధంగా వెలుస్తున్న ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదు.

ఆలిండియా క్రీడా పోటీల్లో ప్రతిభ చాటిన పోలీసు అధికారులు

వతకాలు సాధించిన కట్టా హరిప్రసాద్, మాధవి ఇతర పోలీసు అధికారులు.

జూబ్లీహిల్స్, మే 13, ప్రభాతవార్తః

ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నగరంలో మే 8 నుండి 13 వరకు నిర్వహించిన 2వ ఆల్ ఇండియా బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ పోటీల్లో పలువురు పోలీసు అధికారులు తమ ప్రతిభ కనబరిచారు. మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ ఎసిపి కట్టా హరిప్రసాద్, హుజూరాబాద్ ఎసిపి వి. మాధవి బృందం రజత పతకం(సిల్వర్ మెడల్) సాధించారు. ఈ విభాగంలో ఇంటెలిజెన్స్ బ్యూరోకు చెందిన ఎన్‌జీ రతన్ కుమార్, బీసీ రాంబాయి బృందం స్వర్ణ పతకం గెలుచుకున్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఐజీపీ ఎ. రవి కృష్ణ, ఎస్పీ జి. స్వరూపరాణి బృందంతోపాటు సీఆర్‌పీఎఫ్‌కు చెందిన అలోక్ కుమార్ శ్రీవాస్తవ, విజయ్ ధౌండియాల్ జంటలు కాంస్య పతకాలు సాధించాయి. ఈ పోటీల్లో పాల్గొన్న అధికారులు తమ ప్రతిభతో విశేషంగా ఆకట్టుకున్నారు.

తెలంగాణ సారస్వత పరిషత్తు సాయం కళాశాలలో తెలుగు కోర్సులు

నాంపల్లి, మే 13 ప్రభాతవార్త : బొగ్గులకుంట తిలక్‌రోడ్‌లోని తెలంగాణ సారస్వత పరిషత్తు ప్రాచ్య (సాయం)కళాశాలలో వివిధ తెలుగు కోర్సులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 1965లో ప్రారంభమైన ఈ కళాశాలలో తెలుగు భాషా సాహిత్యాల్లో పిడిసి (ప్రీ డిగ్రీ కోర్సు), బిఎ (లాంగ్వేజెస్), ఎంఎ (లాంగ్వేజెస్) కోర్సులు నడుస్తున్నాయి, ఈ కోర్సులు చదివినవారు తెలుగు పండితులుగా కళాశాలలు, విశ్వవిద్యాలయాల ఆచార్యులుగా, అధికారులుగా, పాత్రికేయులుగా స్థిరపడ్డారు. 10వ తరగతి ఉత్తీర్ణులైనవారు రెండేళ్ల పిడిసి కోర్సుకు అర్హులు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైనవారు బిఎ లాంగ్వేజెస్‌లో డిగ్రీ ఆన్‌లైన్ సిస్టం (దోస్త్) ద్వారా ప్రవేశం పొందవచ్చు. తెలుగు ద్వితీయభాషగా డిగ్రీ ఉత్తీర్ణులైనవారు ఎంఎ లాంగ్వెజెస్‌కు అర్హులు. పగటిపూట వివిధ ఉద్యోగాలు చేసుకుంటూ ఈ తెలుగు కోర్సులు చదువుకోవాలనే ఆసక్తి ఉన్నవారందరూ సాయంత్రం 5నుండి రాత్రి 9గంటల వరకు ఈ కళాశాలలో చేరి తరగతులకు హాజరు కావచ్చును. పూర్తి వివరాల కోసం 9441085114 / 9032812971 నంబర్లకు ఫోన్‌లో సంప్రదించవచ్చునని కళాశాల కరస్పాండెంట్, సారస్వత పరిషత్తు ప్రధాన కార్యదర్శి డా. జుర్రు చెన్నయ్య ప్రకటనలో తెలిపారు.

కబుతర్‌ఖానా 15వ బూత్‌లో సర్ కొనసాగింపు..

ఓటర్ల జాబితాల సవరణ పరిశీలిస్తున్న మాజీ కార్పొరేటర్ సున్నం రాజమోహన్

అఫ్జల్‌గంజ్,మే 13 ప్రభాతవార్త: ఓటుహక్కు ప్రతి ఒకరు భాధ్యతగా భావించి,అంతేకాకుండా ప్రత్యేకంగా ఓటర్ల జాబితాల సవరణ కార్యక్రమాన్ని పురానాపూల్ డివిజన్‌లోశ్రీకారం చుట్టారు. డివిజన్ పరిధిలోని 15వ బూత్ వద్ద ఎస్.ఐ.ఆర్(స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్)నిర్వహించారు.డివిజన్ మాజీ కార్పొరేటర్ సున్నంరాజమోహన్ పర్యవేక్షణలో మజ్లీస్ క్రియాశీలసభ్యులు అమ్జద్‌ఖాద్రి 15వ పోలింగ్ బూత్‌వద్ద ప్రత్యేక విస్తృత పునశ్చరణ(సర్)పనిని చేపట్టారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మజ్లీస్ అధినేత, పార్లమెంట్‌సభ్యులు అసదుద్దీన్ ఒవైసీ,చార్మినార్ శాసనసభ్యులు మీర్ జుల్ఫికర్ అలీ సూచనల మేరకు పని చేస్తున్నామన్నారు.ఈ కార్యక్రమంలో మజ్లీస్ కార్యకర్త అంజాద్‌ఖాద్రి పాల్గొన్నారు

సిఎం రేవంత్ రెడ్డిని కలిసిన జగదీశ్వర్,ముజీబ్ హుస్సేనీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి తన కుమారుడి వివాహ పత్రికను అందచేస్తున్న టిఎన్‌జిఓ కేంద్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్.ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ,ఈచిత్రంలో అధ్యక్షులు ఎం.జగదీశ్వర్ తదితరులు ఉన్నారు.

గన్‌ఫౌండ్రి,మే13ప్రభాతవార్త: తెలంగాణ నాన్ గజిటెడ్ కేంద్ర సంఘం,అధ్యక్షులు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సే నీలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా తెలంగాణ నాన్ గజిటెడ్ కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శిడాక్టర్ ఎస్.ఎం.ముజీబ్‌హుస్సే నీ కుమారుడు అసదుద్దీన్ వివాహం ఈనెల 15వ తేదిన జరగనున్న పెండ్లీ వేడుకకు ఆహ్వానించి పత్రికను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందచేశారు.పెండ్లీ కుమారుడుఅసదుద్దీన్ కూడా స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి పెండ్లిపత్రికను అందచేసినట్లు డాక్టర్ ముజీబ్‌హుస్సేనీ తెలిపారు.

17న మినీ మహానాడు విజయవంతం చేయాలి



మినీ మహానాడు వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

ముషీరాబాద్, మే 13 ప్రభాతవార్త: ఈ నెల 17వ తేదీన సికింద్రాబాద్ పార్లమెంట్ మినీ మహానాడుకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను టిడిపి సికింద్రాబాద్ పార్లమెంట్ నాయకులు నెల్లెల కిషోర్, శ్రీపతి సతీష్, పి.బాల్‌రాజ్‌గౌడ్, కాసుల సుదర్శన్‌రెడ్డి, తడక వినోద్, గుట్ట అనిల్ కురుమ, ఎం.శ్యాంసుందర్, పి.వంశీకృష్ణ తదితరులు బుధవారం టిడిపి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మినీ మహానాడు కార్యక్రమాన్ని కార్యకర్తలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

తాను జడ్జి కావడానికి ఈ పాఠశాలే కారణం

రత్నకుమారిని సత్కరిస్తున్న కరస్పాండెంట్ , ప్రిన్సిపల్

ముషీరాబాద్, మే 13 ప్రభాతవార్త: కవాడిగూడలోని ఇంగ్లీష్ యూనియన్ హైస్కూల్‌లో 2015-16 సంవత్సరాల్లో పదవ తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థిని వదినపల్లి రత్నకుమారి పాఠశాలకు బుధవారం నాడు విచ్చేసి తాను జూనియర్ సివిల్ జడ్జిగా నియమితులై ప్రస్తుతం రామన్నపేట భువనగిరి యాదగిరి జిల్లా కోర్టులో విధులను నిర్వహిస్తున్నానని పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులకు ధన్యావాదాలు తెలియజేశారు. తన ఎదుగుదలకు ఈ పాఠశాల ఎంతో ఉపయోగపడిందని, 10వ తరగతి వరకు ఇచ్చిన బేసిక్ స్టాండర్డ్స్ వల్లే ఇది సాధ్యమైందన్నారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపల్ పి.స్వర్ణలత, ఉపాధ్యాయులు కృష్ణవేణి, మనీష్, ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు హర్షం వ్యక్తం చేశారు.

గోవధ నిషేధ చట్టాన్ని ప్రభుత్వం పటిష్టంగా అమలు చేయాలి

-భారతీయ ప్రాణి మిత్ర సంఘ్ డిమాండ్

సమావేశంలో మాట్లాడుతున్న జస్‌రాజ్ శ్రీశ్రీమల్. చిత్రంలో మహేష్‌అగర్వాల్, జస్మత్‌పటేల్ తదితరులు

సైఫాబాద్, మే 13 ప్రభాతవార్త: గోవధ నిషేధ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా అమలు చేయాలని, గోవులు, ఎద్దులు, దూడల అక్రమ రవాణాను అరికట్టాలని భారతీయ ప్రాణి మిత్ర సంఘ్ డిమాండ్ చేసింది. గోవధ చట్టాన్ని సక్రమంగా అమలు చేయకపోవడం వల్లనే ప్రతి ఏడాది వేలాది గోవులు, ఎద్దులు, దూడలు బలిఅవుతున్నాయని సంఘ్ ప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సంఘ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జస్‌రాజ్‌శ్రీశ్రీమల్, మహేష్‌అగర్వాల్ మాట్లాడుతూ ఈ నెల 27న బక్రిద్ సందర్భంగా గోవుల అక్రమ రవాణా పెద్ద ఎత్తున జరుగుతున్నదని ఆరోపించారు. ఇప్పటికే వేలాది గోవులు పాతనగరానికి తరలించడం జరిగిందని, వాటిని రహస్య ప్రదేశాల్లో దాచిపెట్టారని, చెక్ పోస్టల వద్ద పోలీసులు ఉన్నప్పటికి పట్టించుకోవడం లేదని, డబ్బులకు అశపడి లారీలను వదిలివేస్తున్నారని ఆరోపించారు. గోవధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని కోరుతూ గతంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, డిజిపి, పశు సంవర్థక శాఖ మంత్రి, తదితరులకు వినతి పత్రాలను సమర్పించామని, వారి నుంచి ఏలాంటి స్పందన రాలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం గోవధ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, చెక్‌పోస్టుల వద్ద భారీగా పోలీసుల బందోబస్తును నిర్వహించాలని, అక్రమ రవాణా దారులను కఠినంగా శిక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘ్ ప్రతినిధులు జస్మత్ పటేల్, రిదేశ్ జాగిర్దార్, ముఖేష్‌చౌహాన్, న్యాయవాది జి.ఎల్.నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సాయి భగీరథ్‌ను తక్షణమే అరెస్టు చేయాలని మహిళల నిరసన

అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న ఐక్య వేదిక ప్రతినిధులు

సైఫాబాద్, మే 13 ప్రభాతవార్త: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయిభగీరథ్ బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ ఆనేక మంది మహిళలు బుధవారం సాయంత్రం ట్యాంక్‌బండ్ వద్దగల డా.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. మహిళా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో వేదిక ప్రతినిధులు వి.సంధ్య, ఝాన్సీ, బి.జ్యోతి, అనురాధ తదితరులు మాట్లాడుతూ బాలిక తనపై భగీరథ్ అత్యాచారం చేశాడని, నాలుగు నెలలుగా లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఫోక్సో చట్టం ప్రకారం తక్షణమే అతన్ని అరెస్టు చేయాలని, పాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారించి శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కేసును తప్పుదారి పట్టించేందుకు, కాపాడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లోని ప్రజా ప్రతినిధులు, పోలీస్ ఉన్నాతాధికారులు ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. సిట్ పేరిట కాలయాపన చేయరాదని, భగీరథ్‌పై ఎఫ్ఐఆర్ నమోదు అయ్యి ఆరురోజులు గడిచినా అరెస్టు చేయకపోవడం వెనుక ఉన్న అంతర్యం ఏమిటని వారు ప్రశ్నించారు. దీని వెనుక ఉన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తక్షణమే పదవికి రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భవిత, సావిత్రి, వరలక్ష్మి పాల్గొన్నారు.

పాతబస్తీలో విద్యాభివృద్ధి కోసం ఉపాధ్యాయులు పాటుపడాలి : ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

విద్యా వారోత్సవాలలో పాల్గొన్న బహదూర్‌పుర ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్

చార్మినార్,మే 13 ప్రభాతవార్త : విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దాల్సిన గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని,పాతబస్తీలో విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులు పాటు పడాలని బహదూర్‌పుర నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ అన్నారు. ప్రజా పాలన -ప్రగతి ప్రణాళికలో భాగంగా బుధవారం పాతబస్తీ జహనుమాలోని సెయింట్ మార్క్స్ బాయిస్ టౌన్ హైస్కూల్‌లో జరిగిన విద్యా వారోత్సవాల కార్యక్రమానికి ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్ ముఖ్య అతిధిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలోని ప్రతీ ఒక్కరూ చదువు కోవాలని,ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలలకువచ్చి విద్యార్థులకు విద్యా బోధనలు చేయాలని తెలిపారు.బహదూర్‌పుర నియోజకవర్గంలోని ఇంద్రా నగర్‌లో పాఠశాల,హైస్కూల్ భవనాన్ని నిర్మించనున్నామని ఆయన తెలియజేశారు.బహదూర్‌పుర జోన్ ఉప విద్యాధికారి ఆర్.సుమన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు పాఠశాలలో మంచి ఫలితాలు తీసుకు రావటానికి అన్ని విధాల కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఎంఐఎం కార్పొరేటర్లు హుస్సేనీ పాషా,బహదూర్‌పుర జోన్ రెండుఐఓఎస్ ఎస్.నరేందర్ యాదవ్‌తో పాటు నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు,హైస్కూళ్లకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిబిఎస్ఈలో వంద శాతం ఫలితాలు

జూబ్లీహిల్స్, మే 13, ప్రభాతవార్తః

సిబిఎస్ఈ 12వ తరగతి పరీక్షా ఫలితాలలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు వంద శాతం ఫలితాలు సాధించారు. జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన జస్మిత మోడపోతుల, దక్ష్ లునియాలు 88.4 శాతం మార్కులతో ప్రథమ స్థానం, అనన్య పటేల్ 87.4 శాతం మార్కులతో రెండో స్థానం, పీయూష్ అగర్వాల్, కనక్ 87.2 శాతం మార్కులతో మూడవ స్థానం సాధించారు. ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ విభాగంలో త్రిజల్ గుప్తా 100 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, ఈ ఫలితాలు సాధించడానికి కారణమైన అధ్యాపక బృందాన్ని డైరక్టర్ ఎమ్. వరలక్ష్మి, ప్రిన్సిపల్ కాంచనవల్లి అభినందించారు. జూబ్లీహిల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షులు ఎ. మురళి ముకుంద్, విద్యార్థుల అత్యుత్తమ ప్రదర్శన పట్ల హర్షం వ్యక్తం చేశారు. భారతీయ విద్యాభవన్స్ పబ్లిక్ స్కూల్ (విద్యాశ్రమం)కు చెందిన విద్యార్థులు సైతం వంద శాతం ఫలితాలు సాధించారు. సహర్ష్ గోయాంక 95.6 శాతం మార్కులు, కామర్స్ విభాగంలో శ్రేష్ట 464 మార్కులు సాధించానట్లు పాఠశాల ప్రిన్సిపల్ అరుణశ్రీ తెలిపారు.

యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్ యాదవ్‌కు సత్కారం

రఘునాథ్‌యాదవ్‌ను సత్కరించిన బిసి ఐక్యసంఘం నేతలు

శేరిలింగంపల్లి,మే 13 ప్రభాతవార్త

శేరిలింగంపల్లి కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకులు మారబోయిన రఘునాథ్ యాదవ్‌ను తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర యాదవ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించటంపై తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచందర్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. బీసీ సంఘాల నేతల ఆధ్వర్యంలో యాదవ కార్పొరేషన్ చైర్మన్ రఘునాథ్‌యాదవ్‌ను ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా భేరి రామచందర్‌యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీలో సుధీర్ఘకాలం అంకితభావంతో పనిచేస్తున్న క్రమంలో పార్టీ అధిష్టానం గుర్తించి రఘునాథ్ యాదవ్‌కు సముచితమైన స్థానం కల్పించటం సంతోషదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక నాయకులు అందెల కుమార్,హరికృష్ణచారి, శ్రీనివాస్ యాదవ్, శివయాదవ్,రమేశ్; బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు అర్‌కే సాయన్న తదితరులు పాల్గొన్నారు.

మద్యం సీసాలతో పట్టుబడ్డిన మేరీపై కేసు

జూబ్లీహిల్స్, మే 13, ప్రభాతవార్తః బోరబండలో బెల్టు షాపు నిర్వమిస్తున్న మరియా అలియాస్ మేరిపై బోరబండ ఠాణాలో కేసు నమోదైంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. మంగళవారం రాత్రి బోరబండ బస్టాప్ వద్ద ఎస్సై కాశయ్య తన సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహిస్తుండగా ఇద్దరు వ్యక్తులు హోండా యాక్టివాపై అనుమానస్పదంగా కనిపించారు. పోలీసులను గమనించి వాహనం నడుపుతున్న వ్యక్తి వాహనాన్ని వదిలి అక్కడి నుంచి పరారవ్వగా వాహనం వెనుక వైపు ఉన్న మహిళ వద్ద మద్యం సీసాలు ఉన్నట్లు గుర్తించారు. ఆమెను విచారించగా మరియా అలియాస్ మేరిగా గుర్తించారు. మొత్తం 105 మద్యం సీసాలను ఆమె వద్ద స్వాధీనం చేసుకున్నారు. మద్యం సీసాలను జేఎస్ వైన్స్‌లో కొనుగోలు చేసినట్లు గుర్తించారు. పట్టుబడిన వాటి విలువ రూ. 13662 ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నవ్వులు చిలికించిన హాస్యగుళికలు పేరిడీ పాటలు

హాస్య పేరిడీ పాటల ప్రదర్శనలో కళాకారులు

రవీంద్రభారతి, మే 13 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి పర్యవేక్షణలో తెలంగాణ ప్రజాకళ శీర్షికన జరుగుతున్న 99 రోజుల ప్రతిష్టాత్మక సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనల్లో భాగంగా రవీంద్ర భారతి ప్రాంగణంలోని పాల్కురికి సోమన్న (ఘంటసాల) కళావేదికలో వివిధ తెలంగాణ కళా సాంస్కృతిక మహోత్సవాలలో భాగంగా అత్యంత అద్భుతంగా ప్రదర్శించిన హాస్యగుళికలు, పేరిడీ పాటలు హాజరైన అశేష ప్రేక్షకుల ముఖాలపై నవ్వులు చిలికించి మనోరంజన కలిగించాయి. ఖమ్మం జిల్లా నుండి వచ్చిన మొగలి ఎంటర్‌టైన్మెంట్ కళాకారులు మొగిలి వెంకటేశ్వర్లు, బూరుగు సుధీర్, జిల్లేపల్లి రమేష్ తదితరులు హాస్య సంభాషణలు, వివిధ హాస్యాంశాల ప్రదర్శనలతోపాటు పలు పేరిడీ పాటలతో ఆవరణ వాతావరణాన్ని హాస్యజల్లులతో ముంచెత్తివేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి ఆయా కళాకారులను ఘనంగా సత్కరించి, ఆసాంతం తన ఉత్తేజపూర్వక వ్యాఖ్యానం, మధ్యమధ్య తీన్మార్ పాటలతో ఉర్రూతలూగిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారధి ప్రముఖ కళాకారుడు విద్యానందచారిని ఎంతగానో అభినందించారు.

అద్భుతం బ్రహ్మంగారి సమాధి ఘట్టం బుర్ర కథ

చిక్కడపల్లి మే 13 (ప్రభాతవార్త) : తెలుగు రాష్ట్రాల ప్రాచీన కళారూపమైన బుర్రకథను నేటి తరానికి అందించడంలో ఇలాంటి సప్తాహాలు ఎంతో దోహదపడతాయని తెలంగాణ బ్రాహ్మణా పరిషత్ వైస్ చైర్మన్ పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయగానసభలోని గుండవరపు హనుమంతరావు కళావేదిక లో గాన సభ నిర్వహణలో అధ్యక్షుడు కళా వి ఎస్ జనార్ధన మూర్తి అధ్యక్షతన తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో గాన సభ పూర్వ అధ్యక్తుడు కళా సుబ్బారావు జయంతి సందర్భంగా ఏడు రోజుల పాటు ప్రముఖులైన కళా కారులచే బుర్ర కథ సప్తాహంలో బ్రహ్మంగారి సమాధి ఘట్టం ను అద్భుతంగా బుర్రకథను వినిపించిన బి.జనార్దన్ ను సత్కరించి పొన్నాడ సుబ్రహ్మణ్య ప్రసాద్ మాట్లాడుతూ ప్రాచీన జానపద కళారూపాలను కాపాడుకోవాల్సి న బాధ్యత మనందరిపై ఉందని అన్నారు. మరుగున పడిపోతున్న బుర్రకథ వంటి కళలకు పూర్వవైభవం తీసుకురావడానికి ప్రభుత్వం, సాంస్కృతిక సంస్థలు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. ఒకప్పుడు సామాజిక చైతన్యానికి, పురాణ గాథల ప్రచారానికి బుర్రకథ ప్రధాన మాధ్యమంగా ఉండేదని, నేటి సాంకేతిక యుగంలో కూడా దాని ప్రాముఖ్యత తగ్గలేదని ఆయన వివరించారు. గానసభ పాలకమండలి సభ్యురాలు గుండవరపు గీతాదేవి పాల్గొన్నారు.

కూకట్‌పల్లి నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి సహకరించండి...

సిఎంసి కమిషనర్ సృజనతో టిపిసిసి ఉపాధ్యక్షులు బండి రమేష్ బేటి

కమిషనర్ సృజనతో మాట్లాడుతున్న బండి రమేష్

కెపిహెచ్‌బి కాలనీ, మే 13, ప్రభాతవార్త:

నియోజకవర్గ సమస్యల పరిష్కారార్థమై టిపిసిసి ఉపాధ్యక్షుడు కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి బండి రమేష్ బుధవారం సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సృజనను కలిశారు. ఈ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలో నెలకొన్న ప్రధాన సమస్యలపై విస్తృతంగా చర్చించారు. హౌసింగ్ బోర్డ్ నుండి హఫీజ్‌పేట్ వెళ్లే రోడ్డును విస్తరించి కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టాలని, స్వాన్ లేక్ నాలా అసంపూర్తిగా ఉందని దాన్ని పూర్తి చేయాలని భువన విజయం షటిల్ గ్రౌండ్ మెయింటెనెన్స్‌ను ప్రైవేట్ వ్యక్తుల నుంచి తీసుకొని జిహెచ్ఎంసి ఆధ్వర్యంలోని నిర్వహణ చేయాలని బండి రమేష్ కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. కెపిహెచ్‌బి కాలనీ పరిధిలోని ఎమినిటీస్ కోసం వదిలిన స్థలాలు అన్నిటికీ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. జిల్లా గ్రంధాలయ సంస్థ కెపిహెచ్‌బి కాలనీలో ఏర్పాటు చేయాలని, అదేవిధంగా కూకట్‌పల్లి ప్రెస్ క్లబ్‌కు కమ్యూనిటీ హాల్‌ను కేటాయించాలని రమేష్ వినతిపత్రంలో పేర్కొన్నారు. అల్లాపూర్ స్మశాన వాటిక మిగిలిపోయిన పనులు త్వరగా పూర్తిచేసి జూన్ 2న ప్రారంభించాలని సిఎంసి కమిషనర్‌కు రమేష్ సూచించారు. ఆయా పనులు విషయమై ఆమె సానుకూలంగా స్పందించినట్లు రమేష్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మయ్య, గాలి బాలాజీ, గొట్టుముక్కల వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

ఖానామెట్‌లోని అసైన్డ్,యుఎల్‌సీ భూముల అక్రమాలపై విచారణ జరపాలి : గ్రామస్తుల డిమాండ్

శేరిలింగంపల్లి ఎమ్మార్వోకు వినతి పత్రం అందిస్తున్న దృశ్యం

శేరిలింగంపల్లి,మే 13 ప్రభాతవార్త

శేరిలింగంపల్లి మండల పరిధిలోని ఖానామెట్ గ్రామంలో ప్రభుత్వ భూముల అక్రమ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. ఈమేరకు శేరిలింగంపల్లి మండల తహశిల్ధార్ మహిపాల్‌రెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఖానామెట్ గ్రామస్థులు సయ్యద్ షకీల్,సయ్యద్ అజమ్,సయ్యద్ తోఫిఖ్, రామకృష్ణలు మాట్లాడుతూ.. 1961 సంవత్సరంలో బలహీనవర్గాడలకు కేటాయించిన భూములు చట్టపరంగా ఇతరులకు బదిలీ చేయరానివాటిగా ఉండగా, ప్రస్తుతం వాటిపై అక్రమ ఆక్రమణలు జరుగుతున్నాయని వాపోయారు. ఎస్‌సి,బీసీ,మైనార్టీ వర్గాల కోసం కేటాయించిన అసైన్డ్ భూములు, అర్బన్ ల్యాండ్ సీలింగ భూములు నియమాలకు విరుద్ధంగా ఆ క్రమించబడుతున్నాయని వారు ఆరోపించారు. ఆక్రమణలపై ఖానామెట్ గ్రామ ప్రజలు, సామాజిక కార్యకర్తలు కలిసి ఈ ఆంశాన్ని ప్రజాహితం దృష్ట్యా అధికారుల దృషికి తీసుకువస్తున్నామన్నారు. అమర్‌నాథ్‌రెడ్డి అనే వ్యక్తి తన అనుచరులతో కలిసి విస్తృత స్థాయిలో అసైన్డ్,యుఎల్‌సీ భూములను అక్రమంగా ఆక్రమిస్తున్నాడని ఆరోపించారు. కోట్ల రూపాయల విలువైన భూములు అక్రమణలకు గురైనట్లు చెప్పుకొచ్చారు . విలువైన భూములు కబ్జాకాకుండా కాపాడాలని కోరారు. కొందరు రెవెన్యూ అధికారులు, ముఖ్యంగా రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ స్థాయిలో ఉన్న వారు ఈ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తూ ఆర్థిక ప్రయోజనాలను పొందుతున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు సమగ్ర విచారణ జరిపితే తగిన అధారాలు సమర్పించేందుకు సిద్దంగా ఉన్నట్లు ఫిర్యాదు దారులు తెలిపారు.ఈ ఆంశంపై ఇప్పటి వరకు కఠిన చర్యలు తీసుకోకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుందని వారు తెలిపారు. సాదారణ ప్రజలకు మాత్రం నోటీసులు జారీ చేస్తూ, ప్రభావశీలులపై చట్టపరమైన చర్యలు తీసుకోకపోవడం వివక్షాత్మకంగా ఉందని విమర్శించారు. ఈ నేపథ్యంలో ఖానామెట్ గ్రామంలో అసైన్డ్,యుఎల్‌సీ భూములు ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి బాద్యులపై చర్యపరమైన చర్యలు తీసుకోవాలని, అసలు లబ్ధిదారులకు భూములు తిరిగి అప్పగించాలని ఫిర్యాదుదారులు ప్రభుత్వాన్ని కోరారు.

నేత్రపర్వంగా హనుమాన్ జయంతి

నాంపల్లి, మే 13 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో గాంధీనగర్ ఎస్‌బిహెచ్ కాలనీ వద్దనున్న అతిపురాతన శ్రీ సంగమేశ్వరస్వామి, శ్రీ వేంకటేశ్వరస్వామి వార్ల దేవాలయంలో శ్రీ హనుమజ్జయంతి ఉత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. వైశాఖ బహుళ దశమి, పూర్వాభాద్ర నక్షత్రం సందర్భంగా శ్రీ హనుమజ్జయంతిని పురస్కరించుకుని తెల్లవారుఝామున ఉదయం 5గంటలకు ఆలయంలోని శ్రీ భక్త ఆంజనేయస్వామి వారి ఆలయ అర్చకస్వాములు పంచామృత, సింధూరాభిషేకాలు, దివ్యాలంకరణ, తదుపరి తమలపాకులతో విశేష సహస్రనామ, అష్టోత్తర శతనామార్చనలు 7గంటల వరకు, ఆంజనేయస్వామికి ఆకుపూజలు మధ్యాహ్నం 12గంటల వరకు నిర్విరామంగా జరిపించారు. అనంతరం ఉదయం 9గంటల నుండి 11.30 గంటల వరకు పెద్దయెత్తున వేదమంత్రోచ్చారణల, అశేష భక్తజన సందోహం తరలిరాగా శ్రీ మన్యుసూక్త హోమం అత్యంత అద్భుతంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చివరిగా పూజలు నిర్వహించిన, విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాల వితరణ కావించారు. శ్రీ హనుమజ్జయంతి సందర్భంగా రాత్రి వరకు అధికసంఖ్యలో ఆంజనేయస్వామి భక్తులు స్వామివారిని దర్శించుకుని తన్మయులయ్యారు.

ఓట్ల తొలగింపుపై దుష్ప్రచారం వద్దు : మర్రి శశిధరరెడ్డి

బీకే గూడాలో డిప్యూటీ కమిషనర్ సుజాతతో మాట్లాడుతున్న మర్రి.

బేగంపేట మే 13,ప్రభాతవార్త

ఓటర్ల జాబితాలో అక్రమాలను అరికట్టేందుకు చేపట్టిన ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఏ ఒక్క కులానికో,మతానికో అపాదించి చూడవద్దని బీజేపీ సీనియర్ నాయకులు మర్రిశశిధర్‌రెడ్డి కోరారు.బుధవారం సాయంత్రం బల్కంపేట బీకే గూడాలోని మున్సిపల్ కార్యాలయంలో డిప్యూటీ కమీషనర్ సుజాతతో ఆయన భేటీ అయ్యారు.ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో జరుగుతున్న ఓట్ల సవరణ,భోగస్ ఓట్ల తొలగింపు ప్రక్రియపై సుదీర్ఘంగా చర్చించారు.అనంతరం మర్రి శశిధర్‌రెడ్డి మాట్లాడుతూ ఓట్ల తొలగింపు అనేది కేవలం ఎన్నికల పారదర్శకత కోసమే తప్ప, రాజకీయ ప్రయోజనాల కోసం కాదని,స్పష్టం చేశారు.గతంలో బెంగాల్ లో తొలగించిన 90లక్షల భోగస్ ఓట్లలో ముస్లీం వర్గానికి చెందినవి కేవలం 30లక్షలు మాత్రమేనని,మిగిలిన 60లక్షల ఓట్లు ఇతర వర్గాలవేనని ఆయన ఉదాహరించారు. దీన్ని బట్టి చూస్తే అధికారులు నిష్పక్షిపాతంగా వ్యవహరిస్తారని అర్ధమవుతుందని,అనవసరంగా ఈ ప్రక్రియను భూతద్దంలో చూసి గందరగోళం సృష్టించవద్దని హితవు పలికారు. కేవలం అర్హులైన వారికి ఓటు హక్కు కలిగి ఉండాలన్నదే తమ ఉద్దేశ్యమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర యువనాయకులు మర్రి పురురవారెడ్డి,దయానంద్,ఆకుల మహేష్,క్రాంతికుమార్,నరేందర్,గుంటి సత్యనారాయణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలి : జంపన



ఆలయంలో పూజలు చేస్తున్న జంపనప్రతాప్ తదితరులు

కంటోన్మెంట్,మే 13 ప్రభాతవార్త: కంటోన్మెంట్ 1వ వార్డు జయ నగర్‌లోని శ్రీ శివ సాయిరాం దేవస్థానం 21వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానసిక ప్రశాంతతకు దేవుళ్లను పూజించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు సాయిబాబా, డాక్టర్ భాస్కర్ బాబు, శర్మ పాల్గొన్నారు.

ఘర్షణవద్దన్నందుకు బీరుసీసాతో దాడి

జూబ్లీహిల్స్, మే 13, ప్రభాతవార్తః

గొడవ చేయకుండా వెళ్లమని చెప్పినందుకు బీరు సీసాతో దాడికి పాల్పడిన సంఘటన బోరబండ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. బోరబండలోని సోని కాకతీయ వైన్స్ ముందు ముదావత్ కమలానాయక్ వాటర్ ప్యాకెట్లు విక్రయిస్తుంటాడు. బోరబండ ఎన్‌ఆర్‌ఆర్‌పురంకు చెందిన పరేలా ప్రకాశ్ అలియాస్ బలాల మద్యం మత్తులో అక్కడికి వచ్చి న్యూసెన్స్‌కు పాల్పడటమే కాకుండా అక్కడున్నవారితో గొడవకు దిగాడు. దీంతో అతన్ని అక్కడి నుంచి గొడవ చేయకుండా వెళ్లమని కమలానాయక్ చెప్పడంతో కోపగించుకున్న బలాల బీరు సీసాతో అతని తలపై దాడికి పాల్పడ్డాడు. దీంతో అతనికి తీవ్ర గాయలయ్యాయి. బాధితుడు బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెళ్లి పేరుతో మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు

జూబ్లీహిల్స్, మే 13, ప్రభాతవార్తః

పెళ్లి పేరుతో మోసానికి పాల్పడిన సంఘటనలో బాధిత యువతి ఫిర్యాదు మేరకు ఒక వ్యక్తిపై కేసు నమోదైంది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. సూరారం ప్రాంతానికి చెందిన పేరవాలి నరేష్‌కు 2020లో యూసుఫ్‌గూడలో ఒక మహిళతో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని నమ్మించడంతో అతని మాటలు నమ్మిన యువతి అతనితో సంబంధం కొనసాగించింది. ఈ క్రమంలో యూసుఫ్‌గూడ, కృష్ణానగర్ ప్రాంతాల్లో అద్దె గదుల్లో పెళ్లి పేరుతో పలుమార్లు శారీరక సంబంధం పెట్టుకున్నాడు. 2024 ఏప్రిల్‌లో యువతి గర్భవతి కాగా బొప్పాయి తినిపించి గర్భస్రావం జరిగేలా చేశాడు. అనంతరం ఇద్దరి మధ్య విభేదాలు తలెత్తడంతో నరేష్ ఆమెను వదిలేసి ప్రవళిక అనే మరో మహిళతో సూరారంలో కలిసి నివసిస్తున్నాడు. ఈ విషయం తెలిసి అక్కడికి వెళ్లిన బాధిత యువతిపై అతను దాడి చేశాడు. బాధితురాలు తొలుత జగద్గిరిగుట్ట ఠాణాలో ఫిర్యాదు చేయగా అక్కడి పోలీసులు కేసు నమోదు చేసి జీరో ఎఫ్ఐఆర్ కింద మధురానగర్ ఠాణాకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బాలలపై అశ్లీల వీడియోలు ఆన్‌లైన్‌లో ప్రసారంపై కేసు నమోదు

జూబ్లీహిల్స్, మే 13, ప్రభాతవార్తః

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో బాలలపై లైంగిక దాడులకు సంబంధించిన అశ్లీల కంటెంట్ ఆన్‌లైన్‌లో ప్రసారం చేసిన ఆరోపణలపై కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్ నుంచి వచ్చిన సమాచారం ఆధారంగా ఎన్‌సిఆర్‌బి ద్వారా పంపిన ఎన్‌సిఎంఈసి సైబర్ టిప్‌లైన్ నివేదికను ప్రాథమికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక అనుమానాస్పద ఇన్‌స్టాగ్రామ్ ఖాతా మొబైల్ నంబర్‌తో లింక్ అయి ఉన్నట్లు గుర్తించారు. ఆ ఖాతా యూసుఫ్‌గూడ, కృష్ణానగర్‌కు చెందిన ఒక మహిళ పేరుతో ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించారు. బాలలపై లైంగిక దాడులకు సంబంధించిన అశ్లీల కంటెంట్ సృష్టి, ప్రసారం లేదా షేరింగ్‌లో ఎవరి పాత్ర ఉందో సమగ్ర దర్యాప్తు ద్వారా నిర్ధారించాల్సి ఉందని అధికారులు తెలిపారు. సున్నితమైన అంశం కావడంతో పోలీసులు గోప్యంగా విచారణ కొనసాగిస్తున్నారు.

అమాయకులను మోసం చేస్తున్న నకిలీ వైద్యుడి అరెస్ట్

బేగంపేట మే 13,ప్రభాతవార్త : మెడలో స్టెతస్కోప్,చేతిలో ఇంజక్షన్ ,ప్రిస్క్రిప్షన్ ఇలా అచ్చం డాక్టర్ లా వైద్యం పేరుతో అమాయక ప్రజలను మోసం చేస్తున్న నకిలీ వైద్యుడిని బేగంపేట పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన బేగంపేట పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.రసూల్ పురా ఇందిరమ్మ నగర్‌లో నకిలీ డాక్టర్ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నట్లు పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది.ఈ మేరకు ఎస్సై శ్రావణ్‌కుమార్ తన పై అధికారుల అనుమతి తీసుకుని ,పవన్‌సాయి క్లినిక్,,పేరుతో నడుపుతున్న క్లినిక్ పై దాడులు నిర్వహించారు.అక్కడ డాక్టర్ గా చెలామణి అవుతూ వైద్యం అందిస్తున్న చేగు సుబ్రమణ్యం(55)ను పోలీసులు విచారించారు.వైద్య వృత్తికి సంబంధించి లైసెన్స్,సరియైన అర్హత పత్రాలను చూపించాలని పోలీసులు నిలదీయడంతో ఎలాంటి పత్రాలు అతను చూయించలేదు.విచారణలో తాను చిన్న క్లినిక్‌ను ప్రారంభించి పేద ప్రజలను ఆకర్షించి వైద్యం చేస్తున్నట్లుగా ఒప్పుకున్నాడు.దీంతో సుబ్రమణ్యం ను అరెస్ట్ చేసి ఆయన వద్ద నుంచి భారీగా ట్యాబ్లెట్లు,ఇంజక్షన్లతో పాటు వైద్యానికి ఉపయోగించే పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఆలయాలు ఆధ్యాత్మిక కేంద్రాలు : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

భూమి పూజలో ఎమ్మెల్యే మర్రి

అల్వాల్, మే 13 ప్రభాతవార్త: శ్రీ మల్లిఖార్జున స్వామి(మల్లన్న) దేవాలయం పునరుద్దరణ పనులను మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి బుధవారం ప్రారంభించారు. మచ్చబొల్లారం డివిజన్ పాకాల కుంట వద్ద పురాతన మల్లన్న దేవాలయం ఉంది. ఆలయ పునరుద్దరణ పనులను స్థానికులు చేపట్టడం జరిగింది. ఆలయ పనులకు సంబంధించి ఎమ్మెల్యే అతిధిగా హాజరై భూమి పూజ చేశారు. ఆలయ అభివృద్ధి పనులు విజయవంతంగా పూర్తి అవుతాయని మర్రి రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. ఆలయాలు ప్రజల విశ్వాసాలకు అధ్యాత్మికతకు కేంద్రాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మటి నాగులు యాదవ్, మల్లేష్, సత్యనారాయణ యాదవ్ బిఆర్ఎస్ నేతలు డోలి రమేష్, పరమేష్, శరణ్ గిరి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : లక్ష్మీకాంత్ రెడ్డి

బాక్స్ డ్రైన్ పనులను పరిశీలిస్తున్న నేతలు

అల్వాల్, మే 13 ప్రభాతవార్త:
అభివృద్ధి అన్ని వర్గాల ప్రజల చెంతకు చేరడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మల్కాజిగిరి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ తోట లక్ష్మీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వెస్ట్ వెంకటాపురం కిరణ్ టాకీస్ ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న బాక్స్ డ్రైన్ పనులను నేతలు, కార్యకర్తలుతో కలిసి పరిశీలించారు. పట్టణ పరిధిలో బాక్స్ డ్రైన్‌లు ఏర్పాటుకు మాజీ మైనంపల్లి హనుమంతరావు హాయాంలో కార్యరూపం దాల్చగా నేడు పనులు దాదాపుగా పూర్తి అయ్యే పరిస్థితికి వచ్చిందన్నారు. అధికార యంత్రాంగం ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నేతలు నిమ్మ అశోక్ రెడ్డి, సూర్యకిరణ్, దేవేందర్, కేబుల్ శేఖర్, బల్వంత్ రెడ్డి, వీనస్ మేరి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

సిఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే శ్రీగణేష్

సిఎం.ఆర్.ఎఫ్.చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్,మే 13 ప్రభాతవార్త: పేద ప్రజలు కార్పోరేట్ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్యం చేయించుకునేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకొని కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్.శ్రీగణేష్ తెలిపారు. నియోజకవర్గానికి చెందిన 30 మందికి మంజూరైన సిఎం.ఆర్.ఎఫ్.చెక్కులను బుధవారం పికెట్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో లబ్ధిదారులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు చిర్రబోయిన సంతోష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్ సర్వే సక్రమంగా చేయాలి : ఎమ్మెల్యే తలసాని

బిఆర్ఎస్ బూత్ లెవల్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అడ్డగుట్ట,మే 13 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ప్రత్యేక ఓటర్ సవరణ (ఎస్.ఐ. ఆర్) సక్రమంగా జరగడం లేదని,అధికారులు ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలని, మాజీ మంత్రి,సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. బుధవారం నియోజకవర్గం పరిధిలోని బిఆర్ఎస్ బూత్ లెవల్ కార్యకర్తల సమావేశంలో పాల్గొని పలు సూచనలు ఇచ్చారు. ఈ నెల 1 నుంచి ప్రారంభమైన ఎస్.ఐ.ఆర్.సర్వే సక్రమంగా లేదన్నారు. ఈ నెల చివరి వరకు కొనసాగుతున్న ఈ సర్వే విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ జాబితాలో నుండి తమ పేర్లు తొలగి పోకుండా చూసుకోవాలన్నారు. ఈ అంశంపై ఈ నెల 16వ తేదీన తెలంగాణ భవన్‌లో బూత్ లెవల్ ఏజెంట్ల సమావేశం జరుగుతుందన్నారు. వచ్చే నెల 1 నుంచి బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్లు అత్తిలి మల్లికార్జున్ గౌడ్,అరుణ శ్రీనివాస్ గౌడ్,శేషుకుమారి, మహేశ్వరీ, బిఆర్ఎస్ నేతలు గుర్రం పవన్ కుమార్ గౌడ్, తలసాని స్కైలాబ్ యాదవ్ పాల్గొన్నారు.

స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌కు అర్హులైన వారిని నియమించాలి : పవన్‌కుమార్ గౌడ్

జీహెచ్ఎంసీ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న గుర్రం పవన్‌కుమార్ గౌడ్

సికింద్రాబాద్, మే 13 ప్రభాతవార్త:
స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో అనుభవస్తులను నియమించి ఓటర్ల వివరాలను సేకరించాలని, ఎలాంటి అనుభవం, సంబంధం లేని విధులు నిర్వహించే వ్యక్తులు ఎస్ఐఆర్ నిర్వహిస్తున్నారని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్‌కు బీఆర్ఎస్ పద్మారావునగర్ ఇంచార్జి గుర్రం పవన్‌కుమార్ గౌడ్ వినితి పత్రం అందజేశారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు పవన్‌కుమార్ గౌడ్ కమిషనర్‌ను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమం సక్రమంగా జరగడం లేదని. 2002 ఓటర్ లిస్ట్ ప్రకారం జరుగుతున్న మ్యాపింగ్ పట్ల బి.ఎల్.ఓ.లకు ఎలాంటి అవగాహన లేదన్నారు. వారు ఒకే చోట కూర్చొని బి.ఎల్ఓ. లు తూతూ మంత్రంగా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. జీహెచ్ఎంసీకి సంబంధంలేని ప్రభుత్వ విభాగాల, ఎలాంటి విద్యా అర్హతలు లేని వారు కూడా ఎస్ఐఆర్ కార్యక్రమంలో వివరాలను సేకరించడం హాస్యస్పదంగా ఉందన్నారు. తక్షణమే సరైన వ్యక్తులను నియమించి పారదర్శకంగా ఎస్ఐఆర్ కార్యక్రమం జరిగేలా చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బన్సిలాల్ పేట్ డివిజన్ అధ్యక్షుడు ఎల్. వెంకటేశం రాజు, సీనియర్ నాయకుడు శైలేందర్, యూత్ వింగ్ అధ్యక్షుడు కొత్తూరు వెంకటేశం,శీను తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మద్యం దుకాణాలను తొలగించాలి : శ్రీనివాస్

నిజాంపేట్, మే 13, ప్రభాతవార్త


వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాస్

గండిమైసమ్మ చౌరస్తా నుంచి మియాపూర్ వరకు ప్రధాన రహదారిపై ఎక్సైజ్ చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా కొనసాగుతున్న మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని సిపిఐ బాచుపల్లి మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం సిపిఐ ఆధ్వర్యంలో ఎక్సైజ్ శాఖ సీఐకి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం పాలసీ ప్రకారం జాతీయ రహదారులు, ప్రధాన రహదారులు, గుడులు, పాఠశాలలకు కనీసం వంద మీటర్ల దూరంలోనే మద్యం విక్రయాలు జరగాలని తెలిపారు. అయితే ప్రస్తుతం ప్రధాన రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా అనేక వైన్ షాపులు కొనసాగుతున్నాయని ఆరోపించారు. ముఖ్యంగా విలిక్కర్, చివాస్ వైన్ షాప్, స్పిరిట్ వైన్ షాప్, ఎస్వీడీ లిక్కర్ షాప్ తదితర దుకాణాలు ఎక్సైజ్ పాలసీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల విలిక్కర్ వైన్ షాప్ వద్ద ఒక కారు ఆకస్మికంగా ఆగడంతో వెనుక నుంచి వస్తున్న వాటర్ ట్యాంకర్ ఢీకొని ప్రమాదం జరిగినట్లు తెలిపారు. ఈ ఘటనలో కారు వెనుక భాగం తీవ్రంగా దెబ్బతిన్నదని, ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని అన్నారు. రహదారులపై మద్యం దుకాణాల కారణంగా అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని ప్రశాంత్ హిల్స్, ఇంద్రన్న కాలనీ, రాజీవ్ గృహకల్ప, సాయి నగర్, ఎన్టీఆర్ నగర్, రాజీవ్ గాంధీ నగర్, ఇందిరమ్మ కాలనీ తదితర ప్రాంతాల్లో కొనసాగుతున్న బెల్ట్ షాపులను కూడా వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకుడు పొన్నాకంటి దస్తగిరి పాల్గొన్నారు.

సనాతన ధర్మం ప్రపంచంలో ప్రధాన మతంగా మారుతుంది

-అఖిల భారత ఇస్కాన్ ఉపాధ్యక్షులు మహామాన్ ప్రభుజీ

హైదరాబాద్ మే13,ప్రభాతవార్త : పాశ్చాత్య దేశాలు తోపాటు అనేక దేశాలలో వేగంగా విస్తరిస్తున్న సనాతన ధర్మం భవిష్యత్తులో ప్రపంచంలో ప్రధాన మతంగా మారుతుందని అఖిల భారత ఇస్కాన్ ఉపాధ్యక్షులు హెచ్. జి. మహామాన్ ప్రభుజీ పేర్కొన్నారు. హైదరాబాద్, దూలపల్లి, డి.ఆర్.ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ లో విద్యార్థులకు గీత పారాయణం వేసవి శిక్షణ శిబిరం 11 రోజులపాటు ఇస్కాన్ కుకట్ పల్లి ఆధ్వర్యంలో జరిగాయి. బుధవారం స్కూల్ ప్రాంగణంలో గీత పారాయణం వేసవి శిక్షణ శిబిరం ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో హెచ్. జి. మహామాన్ ప్రభుజీ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ పవిత్ర భగవద్గీత మానవాళికి ఒక జీవనాధారంగా విస్తృతంగా పరిగణించబడుతుందని, ఎందుకంటే ఇది దైనందిన జీవితంలోని భావోద్వేగ, నైతిక మరియు ఆచరణాత్మక పోరాటాలను ఎదుర్కోవడానికి ఆచరణాత్మకమైన, శాశ్వతమైన మార్గదర్శకత్వాన్ని అందిస్తూ, “ఆత్మసాక్షాత్కారానికి ఒక మార్గదర్శి“గా పనిచేస్తుందని తెలిపారు. డి.ఆర్.ఎస్.ఐ.ఎస్ డైరెక్టర్ అంజనీ కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ భగవద్గీత సార్వత్రిక సత్యాల సిద్ధాంతం, అలాగే నైతిక మరియు ఆధ్యాత్మిక వికాసానికి సంబంధించిన గ్రంథం అని, భగవద్గీతను పఠించడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయని, తల్లితండ్రులు తమ పిల్లలకు భగవద్గీత ప్రాముఖ్యతను తెలియజేయాలి, ఎందుకంటే అది వారిలో ఆత్మపరిశీలన అలవాటును పెంపొందించడానికి మరియు జీవితం పట్ల ఆచరణాత్మక దృక్పథం వైపు వారిని నడిపించడానికి సహాయపడుతుందని అన్నారు. డి.ఆర్.ఎస్.ఐ.ఎస్ ప్రిన్సిపాల్ ఐ. వేణుగోపాల్ మాట్లాడుతూ భగవద్గీతలోని జ్ఞానం విద్యార్థి జీవితంలో నిజమైన వికాసానికి తోడ్పడుతున్నారన్నారు. ఇస్కాన్ కుకట్ పల్లి అధ్యక్షులు మహా శిరింగ్ ప్రభుజీ మాట్లాడుతూ సానుకూల దృక్పథంతో సమతుల్య జీవితం గడపడం కోసం విద్యార్థులకు గత 38 సంవత్సరాలుగా గీత పఠనం శిక్షణ శిబిరాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని, డి.ఆర్.ఎస్.ఐ.ఎస్ లో 70 మంది ఉపాధ్యాయులు, వాలంటీర్ లతో దాదాపు 260 మంది విద్యార్థులకు గీత పఠనం తోపాటు శ్లోక పఠనం, కీర్తనలు పాడడం, వైదిక కథలు, సంస్కారం, నాటకాలు, సాంప్రదాయ నృత్యాలలో శిక్షణ ఇచ్చామని తెలిపారు. వందలాది మంది విద్యార్థులు హాజరైన ఈ కార్యక్రమానికి ధవళ్ చండే కో ఆర్డినేటర్ గా వ్యవహరించారు

భక్తిప్రభంజనం హనుమాన్ చాలీసా పారాయణం

శ్రీ రామభక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో హనుమాన్ చాలీసా పరాయణాన్ని నిర్వహించిన దృశ్యం

చిక్కడపల్లి మే 13 (ప్రభాతవార్త) : భక్తి, శక్తి, సేవా భావాలకు భక్తులు నిర్వహించిన హనుమాన్ చాలీసా పారాయణం బుధవారం ప్రజలలో ఆధ్యాత్మిక చైతన్య వెల్లివిరిసింది. శ్రీ రామభక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 21 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేయడంతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.కార్యక్రమంలో ప్రధాన ఘట్టంగా నిలిచిన హనుమాన్ చాలీసా పారాయణంలో సుమారు 200 మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ ఏకకంఠంతో 21 సార్లు చాలీసాను పఠిస్తుంటే, మారుతీనగర్ వీధులు రామనామ స్మరణతో మార్మోగాయి. భక్తుల ఏకాగ్రత, క్రమశిక్షణతో కూడిన పారాయణం చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం నుంచే ఆలయ ప్రాంగణాన్ని విద్యుత్ దీపాలు, పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆంజనేయ స్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అనంతరం భజనలు, హనుమాన్ దండకం, రామనామ సంకీర్తనలతో భక్తి పారవశ్యం వెల్లివిరిసింది. ప్రస్తుత ఒత్తిడితో కూడిన జీవనశైలిలో ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు మానసిక ప్రశాంతతను, ధైర్యాన్ని ఇస్తాయని నిర్వాహకులు తెలిపారు.పూజా కార్యక్రమాల అనంతరం వందలాది మంది భక్తులకు అన్నదాన ప్రసాద వితరణ జరిగింది. ఈ వేడుకల్లో యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సేవా కార్యక్రమాల్లో చురుగ్గా వ్యవహరించడం విశేషం. మహిళలు ఆలపించిన భక్తి గీతాలు కార్యక్రమానికి అదనపు ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో సంఘసేవకులు పేరి నాగేశ్వర్ రావు, పేరి విజయ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌పిఐ (ఎ) తెలంగాణ రాష్ట్ర కమిటీలు రద్దు

-జూన్ మొదటి వారంలో భారీ బహిరంగ సభ

సమావేశంలో మాట్లాడుతున్న పేరం నాగేశ్వర్‌రావుగౌడ్

సైఫాబాద్, మే 13 ప్రభాతవార్త: భారత రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పిఐ (ఎ) తెలంగాణ రాష్ట్ర కమిటీ, అనుబంధ సంఘాల కమిటీలను జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి రాం దాస్ అత్వాలే ఆదేశాల మేరకు రద్దు చేస్తున్నామని జాతీయ కార్యదర్శి పేరం నాగేశ్వర్‌రావు గౌడ్ తెలిపారు. ఈ మేరకు బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పార్టీ పటిష్టత కోసం వచ్చే జూన్ మొదటివారంలో సికింద్రాబాద్‌లోని పెరేడ్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని, ఈ సభలో రాందాస్ అత్వాలే తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన నూతన కమిటిని ప్రకటిస్తారని తెలిపారు. వచ్చే జిహెచ్ఎంసి ఎన్నికల్లో బిజెపితో కలిసి తమ పార్టీ పోటీ చేస్తుందని చెప్పారు. బిజెపి, ఆర్‌పిఐ అన్ని డివిజన్‌లలో పోటి చేసి అధికంగా డివిజన్లను సాధించుకుంటుందని చెప్పారు. మహిళల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లును తీసుకు వస్తే పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ ఎంపిలు, రాష్ట్ర ముఖ్యమంత్రి, రాష్ట్రానికి చెందిన 8 మంది లోక్‌సభ సభ్యులు వ్యతిరేకించడాన్ని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఇందిరాపార్కు వద్ద ధర్నా చేపట్టడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ బంద్‌ను విజయవంతం చేయాలి

గోడపత్రికను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సికింద్రాబాద్, మే 13 ప్రభాతవార్త:
భవన నిర్మాణదారులు సెంట్రింగ్ నిర్మాణానికి చెల్లిస్తున్న ధరలు సరిపోవడం లేదని, వెంటనే పెంచాలని డిమాండ్ చేస్తూ నగర వ్యాప్తంగా కాంట్రాక్టర్స్ అసోసియేషన్స్, సెంట్రింగ్ కార్మికులు చెపట్టనున్న బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ వారసిగూడ పార్సిగుట్ట సెంట్రింగ్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో వారాసిగూడలో గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత పి. రవిప్రసాద్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈనెల 16నుంచి సెంట్రింగ్ కాంట్రాక్టర్‌లు, కార్మికులు సెంట్రింగ్‌కు ఉపయోగించే ముడి సరుకుల ధరలు భారీగా పెరిగిపోయాయని, ప్రస్తుతం భవన నిర్మాణదారులు చెల్లింస్తున్న ధరలు సరిపోవడం లేదని, నష్టాలను ఎదుర్కోవల్సి వస్తోందని తెలిపారు. కార్మికులకు తమ మద్దతు ఉంటుందని రవి ప్రసాద్ గౌడ్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో అంబాల రాజేశ్వర్‌రావు కార్మిక నేతలు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి అందజేత...

కెపిహెచ్‌బి కాలనీ, మే 13, ప్రభాతవార్త : కూకట్‌పల్లి నియోజకవర్గంలోని ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్‌కి చెందిన సయ్య సుల్తానా, బాలానగర్ డివిజన్‌కి చెందిన సిహెచ్ మాణిక్యంలకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరైనవి. కమ్మ కార్పొరేషన్ చైర్మన్ కూకట్‌పల్లి టిపిసిసి ఉపాధ్యక్షులు, జహీరాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి బండి రమేష్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిదికి ధరకాస్తూ చేసుకోగ మంజూరైన లక్ష రూపాయల చెక్కులను బండి రమేష్ చేతుల మీదుగా బుధవారం కూకట్‌పల్లి నియోజకవర్గం హేమ దుర్గ భవన్‌లో గల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్ష్మయ్య, లక్ష్మణ్ గౌడ్, రామ్ మోహన్ రావు, రంగమోహన్, గోపాల్ చౌదరి, ధర్మారావు పాల్గొన్నారు.

భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు ప్రాధాన్యం

శంకుస్థాపనలో పాల్గొన్న పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

కెపిహెచ్‌బి కాలనీ, మే 13, ప్రభాతవార్త
వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని బాగ్ అమీర్, పటేల్ కుంట పార్క్ వెనుక భాగం కాలనీలలో 28.9 లక్షల అంచనావ్యయంతో నూతనంగా చేపట్టబోయే భూగర్భ డ్రైనేజీ నిర్మాణ పనులకు జల్మమడలి అధికారులు మాజీ కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజి సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళుతున్నాం అని, పలు కాలనీ లలో ప్రజల నుండి వచ్చిన వినతి మేరకు మా దృష్టికి వచ్చిన సమస్యలను పరిగణలోకి తీసుకొని ప్రత్యేక చొరవతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టనున్నట్లు చెప్పారు.ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు జిఎం హరిశంకర్, డిజిఎం శ్రీనివాసరాజు, మేనేజర్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డగుట్టలో పెండింగ్ పనులు పూర్తి చేయాలి : లింగాని

తుకారాంగేట్‌లో రోడ్డు మరమ్మత్తు పనులను పరిశీలిస్తున్న మాజీ కార్పోరేటర్ లింగాని ప్రసన్న తదితరులు

అడ్డగుట్ట,మే 13 ప్రభాతవార్త: అడ్డగుట్ట డివిజన్ తుకారాంగేట్ ముత్యాలమ్మ దేవా లయం వద్ద కొనసాగుతున్న సీసీ రోడ్డు నిర్మాణం పనుల ను బుధవారం మాజీ కార్పోరే టర్ లింగాని ప్రసన్న పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆ మె మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగుతున్న పెండింగ్ పనులను పూర్తి చేయాల న్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు లింగాని శ్రీనివాస్,నక్క మధు, శ్రీరాములు, అమర్, శివ, పొన్నాల రాజు,గోపి, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

బండి భగీరథ్‌ను అరెస్ట్ చేయాలని మహిళా సంఘాల ఆందోళన

పేట్ బషీరాబాద్, మే 13, ప్రభాతవార్త : కేంద్రమంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో ఇప్పటికీ అరెస్ట్ చేయకపోవడాన్ని నిరసిస్తూ పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ, ఐఎఫ్‌టీయూ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ జాతీయ నాయ కురాలు బి. సంధ్య, జి. ఝాన్సీ, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనురాధ మాట్లాడుతూ అధికారంలో ఉన్నవారు మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే సామా న్యుల కంటే కఠినంగా శిక్షి ంచేందుకే నిర్భయ చట్టం తీసుకువచ్చారని పేర్కొన్నారు. అయితే కేంద్ర సహాయ మంత్రి కుమారుడైన భగీరథ్‌ను కాపాడేందుకు ప్రభుత్వ పెద్దలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.పోక్సో కేసు నమోదు అయి వారం గడిచినా ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేయకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయని వారు ఆరోపించారు. ఆందోళన సందర్భంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో పోలీసులు నిరసనకారులను అదుపులోకి తీసుకుని మేడ్చల్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బాధి తురాలిపై హనీట్రాప్ కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండించిన నాయకులు, ముందుగా పోక్సో ఫిర్యాదు వచ్చిన తర్వాతే ఎదురు కేసు నమోదు చేయడం అనుమా నాలకు తావిస్తోందన్నారు.సామాన్యులపై వెంటనే చర్యలు తీసుకునే పోలీసులు, ప్రభావ శీలుల విషయంలో మాత్రం ఆలస్యం చేస్తున్నారని విమర్శించారు. విచారణలో జాప్యం వెనుక ఉన్నతస్థాయి రాజకీయ ప్రమేయం ఉందని, బాధితురాలికి న్యాయం జరగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ నేతలు బేటీ బచావో అంటూ ప్రచారం చేస్తూ, తమకు సంబంధించిన కేసుల్లో మాత్రం నైతిక విలువలు పాటించడం లేదని మండిపడ్డారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ వ్యవహారంలో స్పష్టమైన వైఖరి తీసుకోవాలని డిమాండ్ చేశారు.బండి భగీరథ్‌ను తక్షణమే అరెస్ట్ చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని, లేకపోతే తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగరాజు, నవీన్, శ్యామ్, ఆసిఫ్, ప్రేమలత, భారతి, అనిత, నాగమణి, మాధవి, పుష్ప, లక్ష్మి, శ్రీనివాస్, శోభ పాల్గొన్నారు.

వైభవంగా నవగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం

విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొన్న నాయకులు

నిజాంపేట్, మే 13, ప్రభాతవార్త
బండారి లేఔట్‌లోని శ్రీ దక్షిణముఖ అభయాంజనేయ స్వామి దేవాలయ సన్నిధిలో నూతన నవగ్రహ విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం బుధవారం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఘనంగా నిర్వహించారు. గత మూడు రోజులుగా 20వ హనుమాన్ జయంతి ఉత్సవాలతో పాటు కొనసాగిన ఈ మహోత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ మహోత్సవంలో భాగంగా మూలమంత్ర హోమాలు, గార్త పూజలు, మహా పూర్ణాహుతి, కుంభప్రోక్షణ, మహాబలి ప్రథమ ఆరాధన నిర్వహించి నవగ్రహ స్థిర యంత్ర విగ్రహాలను ప్రతిష్టించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ, తీర్థ ప్రసాదాలు అందజేసి కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో లుక్స్ గ్లోబల్ ఫౌండేషన్ ఫౌండర్ చైర్మన్, నిజాంపేట్ బీజేపీ అధ్యక్షులు బిక్షపతి యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీర్వాదం పొందారు. అలాగే ఆలయ ధర్మకర్త సీతారామయ్య, ఆలయ అధ్యక్షులు వెంకట్రావు, ఉపాధ్యక్షులు సచిన్, సెక్రటరీ గౌతమ్, ట్రెజరర్ అమరేందర్ పాల్గొన్నారు.

అల్మారాలో దాచిన రెండు నెక్లెస్‌లు మాయం

జూబ్లీహిల్స్, మే 13, ప్రభాతవార్త: బోరబండలో ఒక మహిళ అల్మారాలో దాచిపెట్టిన రెండు బంగారు నెక్లెస్‌లు చోరికి గురయ్యాయి. బోరబండ పోలీసుల కథనం ప్రకారం.. ఎర్రగడ్డ నేతాజీనగర్‌కు చెందిన నూర్జహాన్ ఫాతిమా బేగం తన ఇంట్లో అల్మారాలో రెండు నెక్లెస్‌లను దాచిపెట్టింది. కాగా అల్మారాలో తెరిచి చూడగా అందులో దాచిపెట్టిన 50 గ్రాముల బరువున్న రెండు నెక్లెస్‌లు కనిపించలేదు. దీంతో ఆమె బోరబండ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నాయకులు

నిజాంపేట్, మే 13, ప్రభాతవార్త
నిజాంపేట సర్కిల్ పరిధిలోని బండారి లేఅవుట్‌లో ఉన్న అభయాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహించిన నవగ్రహ ప్రతిష్టాపన మహోత్సవ కార్యక్రమం బుధవారం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నిజాంపేట సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం స్వామివారి ఆశీర్వాదం తీసుకుని ఆలయ కమిటీ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు ప్రదీప్ తాళ్లూరి, కాలనీ పెద్దలు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

సికింద్రాబాద్ జెబిఎస్ ప్రాంతాల్లో పోస్టర్ల కలకలం

కంటోన్మెంట్,మే 13 ప్రభాతవార్త: పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు మారుడు బండి భగీరథ్ గత 6 రోజుల నుంచి పరారీలో ఉన్నాడని, అతను కనిపిస్తే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, జూబ్లీ బస్టేషన్,పికెట్ గార్డెన్ పరిసర ప్రాంతాల్లో పోస్టర్లు కనిపించడంతో కళకలం రేకెత్తించింది. గుర్తు తెలియని వ్యక్తులు పోస్టర్లు వేయడంతో ప్రయాణికులు,పాదచారులు చూసి అవక్కాయ్యారు.

తెలంగాణ ప్రభుత్వం
హైదరాబాద్ మహానగర పాలక సంస్థ
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన

నిట్ నెం.	పని స్వభావం	అంచనా ధర (రూ. లక్షలలో)	బిడ్స్ స్వీకరణకు ప్రారంభ/చివరి తేదీ & సమయం	అధికారి పేరు & చిరునామా సెల్ నం.:
01/ZCTO/CRZ/GHMC/2026-27 తేది: 13.05.2026/ ఐటమ్ నం.లు 1 to 5	GHMC, చార్మినార్ జోన్ అన్ని సర్కిల్స్‌కు 2026 బక్రీద్ పండుగ దృష్ట్యా 35Lx45W LLDPE నలుపు పోలీథీన్ కవర్‌లు, 120 మైక్రాన్స్ యొక్క సేకరణ	16.25	డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 15.05.2026 ఉ.11.30గం.వద్ద. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ: 18.05.2026 ఉ.11.30గం. వద్ద.	ZCTO, CRZ, GHMC, హైదరాబాద్ ఫోన్ నెం. 9963833866
01/ZCTO/CRZ/GHMC/2026-27 తేది: 13.05.2026/ ఐటమ్ నం.లు 6 to 11	బక్రీద్ సందర్భంలో ఉత్పత్తి అయిన జంతు వ్యర్థాలు మరియు చెత్త తొలగింపుకు (లేబర్‌తో) మినీటిప్పర్ ఏర్పాటు.	2.77	డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 15.05.2026 ఉ.11.30 గం.వద్ద. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ:18.05.2026 ఉ.11.30గం. వద్ద.	
01/ZCTO/CRZ/GHMC/2026-27 తేది: 13.05.2026/ ఐటమ్ నం.లు 12 to 17	అదే ఏరియాలో బక్రీద్ సందర్భంలో ఉత్పత్తి అయిన జంతు వ్యర్థాలు మరియు చెత్త తొలగింపుకు వాహనాలు మరియు యంత్రాల ఏర్పాటు	64.57	డౌన్‌లోడ్ ప్రారంభ తేదీ: 15.05.2026 ఉ.11.30 గం.వద్ద. బిడ్స్ స్వీకరణకు చివరి తేదీ:18.05.2026 ఉ.11.30గం. వద్ద.	

తదుపరి వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ www.tender.eprocurement.gov.in వద్ద చూడవచ్చును. గమనిక: టెండర్ ప్రకటన తేదీ తర్వాత 1% EMD పొందవలెను.

DIPR.NO.2362-PP/CL/ADVT/1/2026-27 తేది: 13.05.2026 సం/-. ZCTO, CRZ, GHMC.

IN THE COURT OF THE HON'BLE II ADDL. DIST JUDGE, MEDCHAL-MALKAJGIRI DISTRICT, AT: MALKAJGIRI
GWOP. No. 21 OF 2026
Between:
Nacharam @ Babburi Maheshwari ...Petitioner
AND
To whomsoever it may concern ...Respondents
To,
TO WHOMSOEVER IT MAY CONCERN
Whereas the petitioner herein have filed a petition to appoint the petitioner as a guardian of minor child **Baby Babburi Ananya** and to permit the petitioners to sell minors interest in petition schedule property, Anyone having any objection has to appear either in person or through pleader with defense if any on **01.06.2026** at 10:30 am on the above said date before the Hon'ble court, failing which petition will be heard and determined ex-parte and orders passed accordingly.
PETITION SCHEDULE PROPERTY
All that the Plot No.40 admeasuring 200 Sq. Yards or 167.2 Sq.Mtrs in Survey No. 91 and 92 situated at GODUMAKUNTA Village and Gram Panchayath, Keesara Mandal, Medchal Malkajgiri District and bounded by: **North**: Plot No.41, **South**: Neighbour's Land, **East**: 30' Wide Road, **West**: Neighbour's Land.
(BY ORDER OF THE HON'BLE COURT)
Sd/- **S. SRIKANTH**, Advocate, 20-197/96/50/35, K.N.R. Colony, Jawahar Nagar, Kapra Mandal, Medchal-Malkajgiri District. **Cell: 88854 46608**

IN THE COURT OF THE HON'BLE II ADDL. JUNIOR CIVIL JUDGE-CUM-VI ADDL. JUDICIAL MAGISTRATE OF FIRST CLASS :: MEDCHAL MALKAJIGIRI DISTRICT :: AT MEDIPALLY
O.S.NO. 1206 OF 2019
Between:
Ammula Eswara Raghu Prasad
... **Plaintiff**
AND
1) All Concerned.
2)The Tahsildar, Uppal Mandal
... **Defendants**
To
All Concerned
...**Defendant No.1**
Take notice that the present suit is filed by Plaintiff to declare the plaintiff as legal heir for the deceased Sri Ammula Ramakrishna Rao @ A.S.R.Krishna Rao who died on 26-05-1999 and the same is posted to15-06-2026 for your appearance. Make your presence either in personal or through advocate on the said date without any fail. Failing which further steps will be followed as per law.
G.UDAYA BHASKAR RAO
Advocate
H.No.10-2-317/29,
Vijayanagar Colony,
Hyderabad-500 057.
Cell: 9391057336

PUBLIC NOTICE
The General Public is hereby informed that my clients: agreed to purchase the property bearing H.No. 9-1, admeasuring 270 Sq. yards, or 225.72, having a built-up area of 320 Sq. Ft. situated at Gopi Nagar of Serilingampally, Municipality Village & Mandal, Ranga Reddy District and bounded by: North: Neigh's Plot of Mr. Fareed; South: 60-0 Ft. Road, East: 30-0 Ft. Road to Doyens Township and West: Neigh's plot Mr. Vikaraman Nair; from **1. Mr. Mohammed Ishaq S/o Mohammed Khaja,** 45 years, as **owner and 2. Mrs. Ayesha Nasreen W/o Mohammed Ishaq,** age 45 years; both R/o H.No. 9-1, Gopi Naagar, Serilingampally, R.R.Dist. and 3.Mr. Shaik Abdul Raheem S/o Shaik Abdul Khader, 43 years, Occ: Service, R/o H.No. 10-2-318/1/65, Feroz Gandhi Nagar, Vijayanaagar Colony, Hyderabad, as consenting Parties; they agreed to sell for a valuable consideration by receiving part consideration. If any person/persons having any objection, right, title, interest or claim against said property, they shall notify the same to the undersigned with documentary proof within seven (7) days. Any objections received thereafter shall neither be entertained nor binding on my client who will proceed with the registration of sale deed of the said property.
Sd/- Mohd. Mazhar Ali
Advocate,
12-2-800/50, Dilshad Nagar,
Colony, Rethi Bowli, Hyd-28.
Phone: 09246375870

PUBLIC NOTICE
The General public is hereby informed that my client KONA MALLESH s/o late K.Narayana is the absolute owner and possessor of house no.2-3-603/50/C/18, patelnagar, Amberpet, Hyderabad-13 T.S .This property is free from all the civil and criminal litigations in courts filed by the his brother KONA RAJU and his wife KONA LATHA. All the cases have been compromised by way of compromise decrees in the courts and now my client KONA MALLESH is the absolute owner and possessor and title holder of the above mentioned property.
Hence this Notice.
Sd/- NAND KUMAR KULKARNI
Advocate,
Flat No. 302, Royal residency Tilaknagar, Nallakunta, Hyderabad.
Cell.No.9348015458.

ఆపిల్ అవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడిగా నాయిని చెన్నారెడ్డి

తుర్కయంజాల్ మే13,ప్రభాతవార్త

ఆదిపట్ల సర్కిల్ తుర్కయం జాల్ డివిజన్ పరిధిలోని ఇంజాపూర్, ఆపిల్ అవెన్యూ కాలనీ నూతన కమిటీని బుధవారం ఎన్నుకున్నారు. ఈ కమిటీలో ఆపిల్ అవెన్యూ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షునిగా రెండోసారి నాయిని చెన్నారెడ్డిని ఎన్నుకోవడం జరిగింది. ప్రధాన కార్యదర్శి కొమ్మగాని యాదగిరి గౌడ్, కోశాధికారిగా నెల్లూరి నిత్యశ్రీ , ఎన్నుకున్నారు. అధ్యక్షులు నాయిని చెన్నారెడ్డి మాట్లాడుతూ ఆపిల్ రెవెన్యూ కాలిని అభివృద్ధికి కృషి చేస్తానని కాలనీలో ఎలాంటి సమస్యలు ఎదురైన వాటిని ఎమ్మెల్యే దృష్టికి తెలియజేసి త్వరగా అభివృద్ధి పనులు పరిష్కరానికి కృషి చేస్తానన్నారు అదేవిధంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, మరియు రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డి మరియు మాజీ వై చైర్ పర్సన్ గుండ్లపల్లి హరిత ధనరాజ్ గౌడ్ సహకారంతో ఆపిల్ రెవెన్యూ కాలనీ అభివృద్ధి చేస్తానని వారు మాటిచ్చారు ఈ కార్యక్రమంలో ఆపిల్ రెవెన్యూ కాలిని అసోసియేషన్ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

నేపాలి జాతీయులను నియమించుకునే ముందు తప్పనిసరిగా పోలీసు వెరిఫికేషన్ చేయించుకోవాలి

: ఏసిపి రాజా వెంకటరెడ్డి

మలక్ పేట, మే 13, ప్రభాతవార్త:

ఇళ్లల్లో పనుల కోసం నేపాలి జాతీయులను నియమించుకునే ముందు తప్పనిసరిగా పోలీసు వెరిఫికేషన్ చేయించుకోవాలని మలక్ పేట ఏసిపి రాజా వెంకట రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలో ఇటీవల నేపాలి జాతీయులు గృహ సహాయకులు, వాచ్‌మెన్లు పేరుతో పనిచేస్తూ నేరాలకు పాల్పడిన ఘటనల నేపథ్యంలో మలక్‌పేట్ డివిజన్ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ సహాయకులు, వాచ్‌మెన్లు, డ్రైవర్లు, కేర్‌టేకర్లు, వంట మనుషులు తదితర పనుల కోసం నేపాలి జాతీయులను ఇళ్లల్లో నియమించుకునే ముందు తప్పనిసరిగా పోలీసు వెరిఫికేషన్ చేయించుకోవాలని, ఆధార్/గుర్తింపు పత్రాలు, చిరునామా వివరాలు, ఫోటోలు మరియు పూర్తి వ్యక్తిగత వివరాలు స్థానిక పోలీస్ స్టేషన్‌లో నమోదు చేయాలని తెలిపారు.అపార్ట్‌మెంట్ అసోసియేషన్లు, గేటెడ్ కమ్యూనిటీలు, సెక్యూరిటీ ఏజెన్సీలు మరియు వాణిజ్య సంస్థలు తమ వద్ద పనిచేస్తున్న నేపాలి జాతీయుల వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు అందించాలని సూచించారు.ఒంటరిగా నివసించే వృద్ధులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కదలికలు గమనించిన వెంటనే డయల్ 100 లేదా సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.ప్రజల భద్రత కోసం మలక్‌పేట్ డివిజన్ పోలీ సులు ప్రత్యేక వెరిఫికేషన్ డ్రైవులు, రాత్రి సమయంలో పోలీస్ పెట్రోలింగ్, కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.

చిన్న వాహనాలపై చలాన్లు రద్దు చేయాలి: పోల్కం శ్రీనివాస్

ట్రాఫిక్ అడిషనల్ కమిషనర్ జోయల్ డేవిస్ తో భేటీ అయిన పోల్కం శ్రీనివాస్

మలక్ పేట, మే 13, ప్రభాతవార్త:

జలమండలిలో ఎమర్జెన్సీ పనులను నిర్వహిస్తున్న చిన్న వాహనాలపై ట్రాఫిక్ చలాన్లు విధించడం సమంజసం కాదని తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ఓబీసీ సెల్ సీనియర్ జనరల్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. జల మండలి విభాగంలో అంత్యావసర పనులను నిర్వహించే బడుగు బలహీన వర్గాలకు చెందిన చిన్న కాంట్రాక్టర్లు రోడ్డుపై మ్యాన్ హోల్స్ మరమ్మతుల కోసం సిమెంట్, బ్రిక్స్, ఇటుక, సిమెంటు, ఇసుక, కంకర తెచ్చి రోడ్డుపైన ఫ్లైఓవర్ బ్రిడ్జ్ పక్కన వేస్తుండగా ట్రాఫిక్ పోలీసులు ఫోటోలు దించి చలాన్లు వేయడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమర్జెన్సీలో ప్రజల ప్రాణాలను కాపాడడం కొరకు మరమ్మ త్తులు చేస్తున్న వారికి చలాన్లు వేయడం సమంజసం కాదని తక్షణమే రద్దు చేయాలని నగర ట్రాఫిక్ అడిషనల్ పోలీస్ కమిషనర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదవారికి ఇందిరమ్మ రాజ్యంలో న్యాయం చేయాలని పేర్కొన్నారు.

పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి : ఎమ్మెల్యే బలాల

లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్ పేట, మే 13,ప్రభాతవార్త:

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోందని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే బలాల అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించడంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో తోడ్పడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల తాగునీటి కోసం వాటర్స్ బౌల్స్ పంపిణీ



వాటర్ బౌల్స్ పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి

సైదాబాద్, మే 13 ప్రభాతవార్త: ఎండా కాలంలో వీధి కుక్కలకు త్రాగునీరు దొరకక పోవడంతో, ప్రజలపై ఆగ్రహంతో దాడి చేస్తున్నాయని లింగోజిగూడ డివిజన్ మాజీ కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. వెటర్నరి అధికారి బిక్యా నాయక్‌తో కలసి పలువురికి వాటర్ బౌల్స్‌ను పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ కాలనీ వాసులు ఎవరికైనా వాటర్ బౌల్స్ కావాలంటే తమ కార్యాలయంలో అందుబాటులో ఉంటాయని తెలిపారు. కుక్కలు ఎక్కువగా తిరిగే ప్రదేశాల్లో వాటర్‌బౌల్స్‌ను ఏర్పాటు చేసి జంతువుల పట్ల మానవత్వంతో వ్యవహరించాలని, సమాజ భద్రతకు తోడ్పాటు అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిని యధావిధిగా కొనసాగించాలి : ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వనస్థలిపురం మే13,ప్రభాతవార్త :

ఎల్.బి.నగర్ నియోజకవర్గ పరిధిలోని వనస్థలిపురం ఏరియా హాస్పిటల్‌ను యథాతథంగా కొనసాగించాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహని బుధవారం సచివాలయంలో ఎల్.బి.నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కొన్ని తప్పుడు నిర్ణయాలు మానుకోవాలి అని అన్నారు. వనస్థలిపురం ఏరియా హాస్పిటల్‌ను మహేశ్వరం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌కు అప్పగించే ప్రతిపాదనతో పాటు, అక్కడి రెగ్యులర్, కాంట్రాక్ట్ మరియు ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని ఇతర ఆసుపత్రులకు బదిలీ చేసే ప్రక్రియపై ఆసుపత్రి సిబ్బంది తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. వనస్థలిపురం ఏరియా హాస్పిటల్ పరిసర కాలనీల ప్రజలకు,చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలకు కీలక వైద్య సేవలు అందిస్తున్న ముఖ్య కేంద్రంగా కొనసాగుతోందని, ఆసుపత్రి మార్పు లేదా సిబ్బంది బదిలీల వల్ల స్థానిక ప్రజలకు వైద్య సేవల విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ప్రస్తుతం ఉన్న సిబ్బందితోనే వనస్థలిపురం ఏరియా హాస్పిటల్‌ను కొనసాగించాలని మంత్రి గారిని ఎమ్మెల్యే శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు విజ్ఞప్తి చేశారు. అనంతరం మంత్రి శ్రీ దామోదర రాజ నరసింహ మాట్లాడుతూ హాస్పిటల్ మరియు సిబ్బం ది విషయంలో అధికారులతో మాట్లాడి తగిన నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి గారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వనస్థలిపురం డివిజన్ భారస అధ్యక్షులు చింతల రవికుమార్, బి.యన్.రెడ్డి నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షుడు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, ఎల్.బి.నగర్ నియోజకవర్గ భారస పార్టీ యూత్ అధ్యక్షులు రవిముదిరాజ్, మధుసాగర్, ఏరియా హాస్పిటల్ సిబ్బంది శివకుమార్, గఫర్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి దామోదర రాజనర్సింహకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌ను మార్చాలని పిసిసి చీఫ్‌కు వినతి

ఉప్పల్, మే 13 ప్రభాతవార్త : తెలంగాణ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ నియామకాన్ని పునః సమీక్షించి వడ్డెర సంఘం సూచించిన వ్యక్తికే చైర్మన్ పదవి ఇవ్వాలని పలువురు వడ్డెర సంఘం నేతలు బుధవారం పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరాత్రి బిక్షం అధ్యక్షతన బుధవారం కాంగ్రెస్ పార్టీ పిసిసి అధ్యక్షుబు బి. మహేష్ కుమార్ గౌడ్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు శివరాత్రి అయిలమల్లు మాట్లాడుతూ వడ్డెర కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం వడ్డెర కులస్తుల అభ్యున్నతికై వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్ ను నియమించడం అభినందనీయమన్నారు. వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ పదవికి తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు మాత్రమే అర్హులని, వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు కావడానికి గత రెండున్నర సంవత్సరాల నుండి రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే విధంగా అనేకమార్లు కాంగ్రెస్ పార్టీ పెద్దలకు మంత్రులకు ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు అందజేశామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వడ్డెర కార్పొరేట్ చైర్మన్‌గా ప్రకటించిన గుంజ రేణుక గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో దేవరకొండ జడ్పిటిసిగా ఐదు సంవత్సరాలు పదవిలో ఉండి స్థానిక వడ్డెరలను పట్టించుకోలేదన్నారు. వడ్డెర కుల అభివృద్ధి కోసం, మండల నియోజకవర్గ జిల్లా వడ్డెర ప్రజలకు చేసిందేమి లేదన్నారు. వడ్డెర్ల అభివృద్ధి కోసం తమ స్థితిగతులు తెలిసిన వ్యక్తి నూతన వడ్డెర కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించాలని కోరారు. దీనిపై పిసిసి అధ్యక్షుడు సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మంజుల నగేష్, రాష్ట్ర కోశాధికారి గుర్రం శ్రీనివాస్, రాష్ట్ర కార్యదర్శి సంపంగి రామకృష్ణ, బొంత వెంకట్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొలుసుల శ్రీనివాస్, రాష్ట్ర కార్మిక సంఘ ఉపాధ్యక్షులు కొడగల అంజయ్య, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పల్లపు పద్మ, రాష్ట్ర మహిళ సహాయ కార్యదర్శి మక్కల మరమ్మ, రాష్ట్ర యూత్ ఉపాధ్యక్షులు శివరాత్రి వెంకటేష్, రాష్ట్ర యూత్ కార్యదర్శి గుర్రం రాజశేఖర్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు దేరంగుల తిరుపతి, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షులు చిలుకూరి ఇదయ్య, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షురాలు కుంచపు శకుంతల వివిధ జిల్లాల వడ్డెర సంఘ నేతలు, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సత్కరిస్తున్న తెలంగాణ వడ్డెర సంఘం నేతలు

అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలి

-సబ్‌ఇన్స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి, సునీల్ రెడ్డి

కుషాయిగూడ, మే 13, ప్రభాతవార్త

పలుమాస్పద వ్యక్తులు తారసపడిన అసాంఘిక కార్యకలాపాలకు పాటుపడుతున్నట్లు చూసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కుషాయిగూడ సబ్ ఇన్స్పెక్టర్లు సుధాకర్ రెడ్డి సునీల్ రెడ్డిలు పేర్కొన్నారు. కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎం ఎస్ ఐ సి లో ఏర్పాటు చేసిన యాంటీ డ్రగ్స్ మహిళల భద్రత సైబర్ నేరాలు ఇతర నేరాల విషయమై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ జరుగుతున్న సైబర్ క్రైమ్ తో పాటు డ్రగ్స్ మాఫియా మహిళల శాంతిభద్రతల ఉల్లంఘన కార్యక్రమాల విషయమై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. యాంటీ డ్రగ్స్ విషయమై ప్రతి యువతతో పాటు ప్రతి వ్యక్తి బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కాలనీలోని ఇంటి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి సంఘటనలు జరుగుతున్న గమనించి బాధ్యతగా వ్యవహరించి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ముఖ్యంగా ప్రతి కాలనీలో అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా ట్రాఫిక్ భద్రత గురించి నియమాలను తప్పనిసరిగా పాటించాలని సురక్షితంగా ప్రయాణం చేయడానికి హెల్మెట్లు విధిగా ధరించాలని మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని సూచించారు. లైవ్ అరైవ్ అనే నినాదాన్ని వివరించారు. సైబర్ క్రైమ్ వారియర్ పిసిరాజు ఆధ్వ ర్యంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో యువతతో పాటు ఎన్ఎస్ఐసి డైరెక్టర్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఐసీలో యాంటీ డ్రగ్స్ అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న సబ్ ఇన్స్పెక్టర్‌లు సుధాకర్ రెడ్డి సునీల్ రెడ్డి

బడంగ్‌పేట్ పరిధిలో పార్కు స్థలాల అక్రమణలపై సమగ్ర విచారణ జరపాలి : బిజెపి

సరూర్‌నగర్, మే 13 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలో కోట్లాది రూపాయల విలువ జేసే పార్కు స్థలాల ఆక్రమణలపై అధికారులు సమగ్ర విచారణ జరిపి సదరు స్థలాలను స్వాధీనపరచుకోవాలని బిజెపి నాయకులు డిమాండ్ చేశారు. పార్కు స్థలాల అన్యాక్రాంతానికి సంబంధించిన ఆధారాలతో బిజెపి నేతలు ఆయా ప్రాంతాలకు చెందిన స్థానికులతో కలిసి బుధవారం బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్ల కార్డులను ప్రదర్శించి పార్కు స్థలాలను కాపాడాలని నినాదాలు చేశారు. అనంతరం వారంతా సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సమ్మయ్యను కలిసి ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం, వాకింగ్, వ్యాయామం కోసం అదే విధంగా చిన్నారుల ఆటల కోసం అంతేకాకుండా పర్యావరణ పరిరక్షణ కోసం కేటాయించిన పార్కు స్థలాలు చాలా చోట్ల అక్రమణలకు గురవుతున్నాయని అన్నారు. స్థానిక జిహెచ్ఎంసి డివిజన్ 61 బాలాపూర్‌లోని దేవతల గుట్ట పరిధిలో గల సర్వే నెంబర్ 75/1లో దాదాపు 1600 గజాల పార్కు స్థలాన్ని దొంగ సంతకాలతో, ఫోర్జరీ డాక్యుమెంట్లతో కొందరు కబ్జా చేశారని వారు ఆరోపించారు. ప్రస్తుతం సదరు స్థలం మార్కెట్ విలువ ప్రకారం సుమారు రూ.4.80 కోట్ల వరకు ఉంటుందని వారు వెల్లడించారు. అదే విధంగా అదే డివిజన్‌లో కేంద్ర రక్షణ పరిశోధన సంస్థ ఎఆర్‌సిఐ ఉత్తరం వైపు ఉన్న వినాయక నగర్ కాలనీ సర్వే నెంబర్ 43లోని 630 గజాల పార్కు స్థలం అందులో ఉన్న సెప్టిక్ ట్యాంకుతో సహా ఆక్రమణకు గురయ్యే ప్రమాదంలో ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సుల్తాన్‌పూర్‌లో సైతం స్థానిక సర్వే నెంబర్లు 62, 63లలో సుమారు 835 గజాల పార్కు స్థలం ఉండగా అందులో కొంత భాగాన్ని కొందరు ప్రైవేటు వ్యక్తులు రెండు ప్లాట్లుగా విభజించి విక్రయించారని బిజెపి నేతలతో పాటు స్థానిక భూయజమాని ఎన్ను యాదిరెడ్డి ఆరోపించారు. గత బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పాలనలో అధికార దుర్వినియోగం, నాటి మేయర్, డిప్యూటీ మేయర్‌ల నిర్లక్ష్యం, సహకారంతోనే పార్కు స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయని వారు ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు జరిగిన పార్కు స్థలాల అక్రమణలు, కబ్జాలు, ప్రయత్నాలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపించాలని వారు డిప్యూటీ కమీషనర్‌ను కోరారు. సంబంధిత స్థలాలన్నింటినీ స్వాధీనం చేసుకొని జిహెచ్ఎంసి బోర్డులు ఏర్పాటు చేసి ప్రజోపయోగార్థం సదరు స్థలాలను ఉపయోగించాలని వారు కోరారు. లేని పక్షంలో ఏకంగా జిహెచ్ఎంసి కమీషనర్ కార్యాలయం ఎదుటే పెద్ద ఎత్తున ధర్నాకు దిగి ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ బిజెపి ఇంఛార్జి పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రావుల మల్లేష్, మాజీ కార్పొరేటర్ తోట శ్రీధర్‌రెడ్డి, నాయకులు ఎ.సైదులు, నవారు శ్రీనివాస్‌రెడ్డి, ఎం.ప్రవీణ్‌గౌడ్, గుండె నాగార్జున బాబు, శ్రీకాంత్‌గౌడ్, జి.మల్లేష్, కళ్లెం లక్ష్మారెడ్డి, భరత్ ముదిరాజ్, రామాచారి, కళ్లెం మురళీధర్‌రెడ్డి, సిహెచ్ ఆంజనేయులు ముదిరాజ్, గండికోట అంజయ్య, శంకరమోహన్, శివ ముదిరాజ్, మహిళా నాయకురాళ్లు కావ్య, పద్మజ, మీనాక్షి తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో నిరసన వ్యక్తం చేస్తున్న బిజెపి నాయకులు పోరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రావుల మల్లేష్ తదితరులు

చెరువుల్లో గుర్రపు డెక్కను తీయించలేని అసమర్థ పాలన కాంగ్రెస్‌ది : అర్కల కామేష్‌రెడ్డి

సరూర్‌నగర్, మే 13 ప్రభాతవార్త: చెరువుల్లో గుర్రపు డెక్కను తీయించలేని అసమర్థ పాలన కాంగ్రెస్ సర్కార్‌దని మీర్‌పేట్ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు అర్కల కామేష్‌రెడ్డి తీవ్ర స్థాయిలో ఆరోపించారు. జిహెచ్ఎంసిలో విలీనమై ప్రస్తుతం బడంగ్‌పేట్ సర్కిల్ కిందకు వచ్చిన గత మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ చందన చెరువు, మీర్‌పేట్ మంత్రాల చెరువు, మీర్‌పేట్ పెద్ద చెరువులలో దాదాపు రెండు సంవత్సరాల నుండి గుర్రపు డెక్క పెరుగుతూ పూర్తిగా కప్పేసినా నేటి వరకు తొలగించకపోవడంపై బిఆర్ఎస్ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు బుధవారం కామేష్‌రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్ బృందం ఆయా చెరువులను సందర్శించి అక్కడి దుస్థితిపై నిరసన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కామేష్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న సమయంలో మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డి ఇక్కడి చెరువులపై ప్రత్యేక దృష్టి సారించి ఎప్పటికప్పుడు గుర్రపు డెక్కను తొలగించేవారని అన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చెరువులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆయన ఆరోపించారు. దాదాపు రెండు సంవత్సరాల నుండి చెరువుల్లో గుర్రపు డెక్క వల్ల దోమలు, దుర్వాసనతో పరిసర ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ సర్కార్ ప్రజల సమస్యలను పూర్తిగా గాలికి వదిలిందని ఆయన దుయ్యబట్టారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక కేవలం ప్రకటనలకే పరిమితం అయ్యిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారం, పది రోజుల్లో చెరువుల్లో నుండి గుర్రపు డెక్కను తొలగించకపోతే స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని కామేష్‌రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు సిద్దాల పెద్ద బీరప్ప, దిండు భూపేష్‌గౌడ్, ఎనుగుల అనిల్ యాదవ్, జమాల్‌పూర్ సునీత బాలరాజ్, పంతంగి మాధవి వెంకటేశ్వర రావు, గడ్డమీది లక్ష్మణ్ ముదిరాజ్, ఎంఎ రజాక్, దయానంద్ ముదిరాజ్‌లతో పాటు పాటు సిద్దాల భరత్, పసుల యాదగిరిరెడ్డి, జగాల్‌రెడ్డి, జ్ఞానేశ్వరచారి పాల్గొన్నారు.

జలమండలి అధికారులతో సమీక్ష సమావేశం

మల్కాజ్‌గిరి, మే 13,ప్రభాతవార్త :

మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జల మండలి అధికారులతో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గౌతమ్ నగర్ ఆర్.యు.బి నిర్మాణ పనుల సందర్భంగా ఎదురవుతున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా ఆర్‌యుబి నిర్మాణంలో భాగంగా జలమండలి పైపులైన్ల మార్పు, సంబంధిత సాంకేతిక అంశాలు మరియు పనుల సమన్వయంపై అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. అదేవిధంగా కొత్త నీటి ప్రతిపాదిక విధానం, బల్క్ వాటర్ సప్లై, వేసవికాలంలో ప్రజలకు తాగునీటి సరఫరాను అంతరాయం లేకుండా సక్రమంగా అందించే చర్యలపై కూడా సమావేశంలో చర్చించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ సునీల్, డీజీఎం రమణ, మేనేజర్ నవీన్, బిఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, లక్ష్మణ్ యాదవ్, ఉస్మాన్, సంజీవరావు, హనుమాన్ చారి పాల్గొన్నారు.

నీట్ పేపర్ లీకేజీపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి : శివకుమార్ గౌడ్

తుర్కయంజాల్ మే 13,ప్రభాతవార్త

పేపర్ లీకేజ్ ని అరికట్టడంలో పరీక్షలను పారదర్శకంగా నిర్వహించడంలో ఎన్ టి ఏ ఘోరంగా విఫలమైందని అఖిలభారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి శివ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.బుధవారం ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్ష నిర్వహించడంలో వరుస వైఫల్యాలకు కారణమవుతున్న నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఎన్ టి ఏ ను శాశ్వతంగా రద్దు చేయాలని ఆయన అన్నారు. ఒకే దేశం ఒకే పరీక్ష అనీ కేంద్రం తీసుకువచ్చిన ఈ విధానం వల్ల విద్యార్థులు చాలా ఒత్తిడికి గురవుతున్నారనీ, నీట్ 2026 పేపర్ లీకేజీ పై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ చేపట్టి బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఆయన కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. దీని వెనకాల తెలంగాణ కార్పొరేట్ దిగ్గజాల హస్తముందని అనుమానం వ్యక్తం చేశారు. ఉన్నత స్థాయి అధికారులతో సమగ్ర విచారణ జరిపి బాధ్యులను కఠినంగా శిక్షించకపోతే దేశవ్యాప్తంగా ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో తీవ్రమైన ఆందోళనలను చేపడతామని వారు డిమాండ్ చేశారు.

సంక్షేమ గురుకులాల్లో వెంటనే బదిలీలు చేపట్టాలి

మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేస్తున్న టిగారియా నాయకులు

సైదాబాద్, మే 13 ప్రభాతవార్త: సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో వెంటనే ఉద్యోగుల బదిలీల షెడ్యూల్‌ను విడుదల చేయాలని కోరుతూ టిగారియా రాష్ట్ర అధ్యక్షుడు అలగోని నర్సింహులు గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎస్.గణేష్‌లు సాంఘీక సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాయింట్ సెక్రటరీ స్థాయి నుండి రికార్డ్ అసిస్టెంట్ వరకు దాదాపు 1600 ప్రమోషన్లు పెండింగ్‌లో ఉన్నాయని అన్నారు. బదిలీల ప్రక్రియను వెంటనే ప్రారంభిస్తే దాదాపు 2400 మంది ఉద్యోగులు లబ్దిపొందుతారని, బదిలీలు, ప్రమోషన్ల ద్వారా మొత్తం 4 వేలకు పైగా గురుకుల ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మే, జూన్ నెలల్లో బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను పూర్తి చేయాలని వారు మంత్రిని కోరారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ యూనిట్ జనరల్ సెక్రటరీ సత్య శ్రీదేవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణంతో శక్తి, భక్తి, ధైర్యం : ఆలే శ్యాంజి

సీతారాముల జ్ఞాపికను అందజేస్తున్న యష్పాల్‌గౌడ్

ఎల్.బి.నగర్, మే 13 ప్రభాతవార్త:

హనుమాన్ జయంతి మహోత్సవ సందర్భంగా హనుమాన్ యువసేన అధ్యక్షులు బోల్గం యశ్పాల్‌గౌడ్ ఆధ్వర్యంలో మోహన్‌నగర్‌లోని బిజెపి కార్యాలయం వద్ద హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ చాలీసా పారాయణం, శ్రీరామ భక్తి గీతాలు, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఎస్ఎస్అఖిలభారత సహ జాగరణ ప్రముఖ ఆలే శ్యాంజి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ హనుమాన్ చాలీసా పారాయణం ప్రతిరోజు అందరూ చదవాలన్నారు. హనుమాన్ చాలీసా పారాయణం చేయడం వల్ల శక్తి, భక్తి, ధైర్యంతో పాటు జయం కలుగుతుందన్నారు. లవ్ జిహాదీతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. రంగారెడ్డి జిల్లా అర్బన్ అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, రంగారెడ్డి జిల్లా ఇన్చార్జ్ ఆలే భాస్కర్ హాజరై భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ యువసేన నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, కిరణ్‌కుమార్, గౌరవ్, సాయినాథ్‌గౌడ్, భావన, సంప్రీత, కొర్లపల్లిస్వామి, వెంకట్, సాయి, నితిన్, రాజు, వేణు, రాజేందర్, యశ్వంత్, సాయి, పృధ్వి పాల్గొన్నారు.

బాలుడు అదృశ్యం..

కుషాయిగూడ, మే 13, ప్రభాతవార్త

ఈసిఎల్‌లో బస్సు ఎక్కి షాద్నగర్ వెళ్తానని చెప్పి నా బాలుడు అదృశ్యమైన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దమ్మాయిగూడలో నివాసం ఉండే బాలరాజ్ బావమరిది గణేష్ 16 దమ్మైగూడ నుండి షాద్నగర్ కు వెళ్తానని చెప్పి ఈసెల్ బస్టాండ్లో దిగిపోయి షాద్ నగర్‌కు చేరుకోకపోవడంతో బంధువులు కుషాయిగూడ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బండి సంజయ్‌పై రాజకీయ కుట్రను ఖండిస్తున్నాం

బండి సంజయ్‌పై జరుగుతున్న కుట్రలు ఖండిస్తున్న మున్నూరు కాపు సంఘాలు

కుషాయిగూడ, మే 13, ప్రభాతవార్త

కేంద్రమంత్రి బండి సంజయ్ పై రాజకీయ కుట్రలు చేస్తున్నారని కాపు కులాల ఐక్యవేదిక, తెలంగాణ మున్నూరు కాపు సంఘం ఉప్పల్ నియోజకవర్గం నాయకులు అన్నారు. బుధవారం కమలానగర్ లోని కాప్రా కాపు సంఘంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాపు సంఘం నాయకులు మాట్లాడుతూ బండి సంజయ్ పై జరుగుతున్న రాజకీయ కుట్రను తీవ్రంగా ఖండించారు. బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి బండి సంజయ్ ఎదుగుదల చూసి ఓర్వలేక అధికార, ప్రతిపక్షాలు బురద చల్లుతున్నాయని అన్నారు. తప్పు చేస్తే తన తనయుడైన చట్టపరంగా చర్య తీసుకోవాలని బండి సంజయ్ తెలిపారు అన్నారు. ఉభయ రాష్ట్రాల కాపు, మున్నూరు కాపు సంఘాలు కేంద్ర మంత్రి బండి సంజయ్ కి సంఘీభావం తెలియజేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాపు కులాల ఐక్యవేదిక అధ్యక్షులు జీవీఎన్ రావు, తెలంగాణ మున్నూరు కాపు సంఘం ఉప్పల్ నియోజకవర్గ అధ్యక్షులు తిప్పిరి రాజాబాబు, కాపు కులాల అడ్వైజర్ మరియు మున్నూరు కాపు కులాల అడ్వైజర్ డాక్టర్ లయన్ రెడ్డి శ్రీనివాస్ రావు, కాపు కులాల అడ్వైజర్స్ దేవర కొండ శ్రీనివాసరావు,ప్రసాద్,నానాజీ, నాగు, పులి సత్య నారాయణ, కేయూ శ్రీధర్, సిహెచ్ సోమేశ్ నాయుడు పాల్గొన్నారు.

సురేఖభాస్కర్‌రెడ్డిలకు కాంగ్రెస్ నేతల స్వాగతం

సురేఖభాస్కర్‌రెడ్డిని సన్మానిస్తున్న గణేష్‌నేత

ఎల్.బి.నగర్, మే 13 ప్రభాతవార్త:

విదేశీ పర్యటన ముగించుకొని స్వదేశానికి విచ్చేసిన మహేశ్వరం నియోజకవర్గం సీనియర్ నాయకులు, టిపీసిసి మెంబర్ దేప సురేఖభాస్కర్‌రెడ్డికి శంషాబాద్ విమానాశ్రయంలో శ్రీరామకృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం పలికారు. పుష్పగుచ్చాన్ని అందజేసి శాలువాతో సన్మానించారు. గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్‌రావ్, ప్రసన్నఆంజనేయస్వామి దేవాలయం చైర్మన్ తల్లాటి రమేష్‌నేత, బీసీ నాయకుడు గట్ల రవీంద్ర, జెల్లా జగన్నాథం, లింగస్వామిగౌడ్, దొర్నాల చంద్రమౌళి, బొడ్డుపల్లి మహేందర్, సాయికుమార్, రాజశ్రీ రామారావు, వెంకటేశ్వర్లు, సైదులు, వెంకటరమణారెడ్డి, అక్బర్, నబీ, జ్ఞానేశ్వర్, రాఘవేందర్‌రెడ్డి, శేఖర్‌ముదిరాజ్, కళ్యాణ్‌యాదవ్, జహంగీర్, మంచుకొండ శ్రీనివాస్, చిలక రాజ్‌సాయికుమార్, జగిని రమేష్, సుదర్శన్, రమేష్‌గౌడ్ కాంగ్రెస్ , నాయకులు పాల్గొన్నారు.

వెంకట్‌రెడ్డినగర్ గంగపుత్ర సంఘం భవనం ప్రారంభం

రామంతాపూర్‌లో గంగపుత్ర సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

రామంతాపూర్, మే 13 ప్రభాతవార్త : రామంతాపూర్ వెంకట్‌రెడ్డినగర్‌లో నూతనంగా నిర్మించిన గంగపుత్ర సంఘం భవనాన్ని బుధవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గంగపుత్రుల సంక్షేమం, అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. గంగపుత్రులకు తగు సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. గంగపుత్ర సంఘం భవనం నిర్మాణం సంఘ కార్యకలాపాలకు, సామాజిక సేవా కార్యక్రమాలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నేతలు డా.బి.వి.చారి, బి.కైలాసపతిగౌడ్, సూరం శంకర్, చాంద్‌పాషా, సంజయ్‌జైన్, వెంకట్ రెడ్డి నగర్ గంగపుత్ర సంఘం అధ్యక్షులు చెవురి వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి కొంతం సత్యనారాయణ, అనేమ్ పెంటయ్య, కార్యదర్శి లక్ష్మయ్య, సలహాదారులు పిల్లి నర్సింహులు, గుర్రం నర్సింహులు, అంబటి శ్రీను, కార్యవర్గ సభ్యులు, పి.నర్సింహులు, జి వెంకటయ్య, సి శ్రీను, జి శివుడు, ఏ రఘు, రమేష్, డి గోపాల్, సి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి గంగపుత్ర భవనాన్ని సందర్శించారు. సంఘం నేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్ పటేల్, కిషోర్ సందీప్, ఉపేందర్ రెడ్డి, బాలయ్య, గొలుసుల స్వామి, కె స్వామి, బొట్టు యాదగిరి, గడ్డం నరసింహ, సోమయ్య, భాను, భాస్కర్, ధనలక్ష్మి, చోటు, రాజేష్, సుమిత్, గౌతమ్, ప్రకాష్, ప్రభాకర్, నాగేష్, సాయి, సచిన్, అశోక్ పాల్గొన్నారు.

ఉప్పల్ స్టేడియంలో సదుపాయాలు కల్పించాలి : ఇర్షద్ ఖాన్

ఉప్పల్ స్టేడియంలో శిథిలావస్థకు చేరిన ఒపెన్ జిమ్ పరికరాలను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత ఇర్షద్ ఖాన్ తదితరులు

ఉప్పల్, మే 13 ప్రభాతవార్త : ఉప్పల్ మున్సిపల్ స్టేడియంలో క్రీడాకారులు, వాకర్స్‌కు తగు సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని బీరప్పగడ్డ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఇర్షద్ ఖాన్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఉప్పల్ మున్సిపల్ ఇండోర్, అవుట్‌డోర్ స్టేడియంను సందర్శించి వాకర్స్, యువత మరియు క్రీడాకారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు క్రీడాకారులు, స్థానికులు ఒపెన్ జిమ్ పరికరాలు పూర్తిగా దెబ్బతిన్నాయని, కొత్త పరికరాలు, ఫ్లోరింగ్ మ్యాట్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఇండోర్ స్టేడియంలో షటిల్ ఆడుతున్న క్రీడాకారులు ఫ్లోరింగ్, ఫ్యాన్స్, పెయింటింగ్ తదితర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. దీనిపై ఇర్షాద్ ఖాన్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, యువత అభివృద్ధి కాంగ్రెస్ పార్టీకి ముఖ్యమని అన్నారు. ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పరమేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అధికారులతో మాట్లాడి త్వరితగతిన పరిష్కారం చేయిస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు పాల్గొన్నారు.